తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
06-05-2026
బుధవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 93
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

## హైదరాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం !

- ఫార్మా, ఐటీ హబ్ గా హైదరాబాద్ కు ప్రపంచ వ్యాప్త గుర్తింపు
- మెడికల్ టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
- దేశంలోనే అతి పెద్ద ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణపై వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా

7





## ఆ కుర్రాడు.. డీఎంకే కోటను కూల్చాడు!

- తలపతి చిన్ననాటి ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్
- ఆర్జీవీ పోస్ట్‌పై దేశవ్యాప్త చర్చ
- స్టాలిన్ సొంత గడ్డపైనే విజయ్ సునామీ
- ఒక్క ఫోటో.. వేల కథనాలు

2



## ప్రాంతీయ వాదం వీడితే
# పతనమేనా?

**ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నిదర్శనమా?**
**జాతీయ రాజకీయాల్లో వేలు పెట్టే ప్రాంతీయ పార్టీలకు గుణపాఠమా?**
**స్టాలిన్, మమతల ఓటమే తాజా సాక్ష్యం .. ఇతర పార్టీలు నేర్చుకుంటాయా?**

ప్రాంతీయ పార్టీల మనుగడకు సంబంధించి భారత రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త చర్చ మొదలైంది. సొంత రాష్ట్రం వదిలి జాతీయ ఆకాశంలోకి ఎగరాలనుకోవడం.. రెక్కలు విరగ్గొట్టుకోవడమేనా అనే ప్రశ్నకు ప్రస్తుత ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో తిరుగులేని నాయకులుగా వెలుగొందుతూ, ఎప్పుడైతే వారు జాతీయ రాజకీయాలపై కన్నేశారో, అప్పుడే వారి సొంత కోటలు కూలిపోవడం ప్రారంభమవుతున్నాయి. ఈ పరిణామాన్ని విశ్లేషిస్తే ప్రాంతీయ పార్టీల వైఫల్యాల వెనుక ఉన్న నేషనల్ అంబిషన్ స్పష్టంగా కనిపిస్తుంది.

**చంద్రబాబు పాఠం..**
**సరిదిద్దుకున్న వ్యూహం**

గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 201819 సమయంలో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ప్రయత్నించి, సొంత రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఘోర పరాజయాన్ని చవిచూశారు. జాతీయ స్థాయిలో కూటములను

మిగతా 2వ పేజీలో..

## శంషాబాద్‌లో ఐటీపీ ఏరో ఇండియా
# కేంద్రానికి శ్రీకారం..

**రూ.453 కోట్ల పెట్టుబడితో హార్డ్‌వేర్ పార్క్‌లో కొత్త ప్రాజెక్ట్**

- ఏరోస్పేస్ రంగానికి ఊతం, గ్లోబల్ హబ్ దిశగా అడుగు
- వందలాది ఉద్యోగాలకు అవకాశాలు
- 2027 నాటికి కార్యకలాపాలు ప్రారంభం

**హైదరాబాద్, మే 5:**
తెలంగాణలో పారిశ్రామిక అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. శంషాబాద్ హార్డ్‌వేర్ పార్క్ మూడో దశలో ఐటీపీ ఏరో ఇండియా తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేశారు.
రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ కార్యక్రమానికి హాజరై పనులను

మిగతా 2వ పేజీలో..





2

## ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి కన్నుమూత

- రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం
- సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత దుర్మరణం
- నాలుగు భాషల్లో 90కి పైగా చిత్రాల నిర్మాణం..
- 'రాజా', 'సూర్యవంశం' వంటి హిట్లతో గుర్తింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, చిరంజీవి, బాలకృష్ణ

## రైతు సమస్యలపై ప్రభుత్వానికి కేటీఆర్ అల్టిమేటం

జనగామలో కేటీఆర్ పర్యటన.. బీఆర్ఎస్ శ్రేణుల స్వాగతం
యశ్వంతపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన
కొనుగోలు జాప్యంపై రైతులు ఆవేదన..
మార్క్‌ఫెడ్‌కు కేటీఆర్ ఫోన్

3



## యూరియా అమ్మకాలపై
# ఆంక్షలు దారుణం..

హరీష్ రావు ఫైర్
రైతాంగం ఇబ్బందులు..
సర్కార్ నిలిపివేతపై విమర్శలు
'రైతు డిక్లరేషన్' హామీలు విఫలం అంటూ ఆరోపణలు
ఆంక్షలు ఎత్తివేయాలని ప్రభుత్వానికి డిమాండ్



**హైదరాబాద్**
తెలం గాణ రాష్ట్రవ్యాప్తంగా యూరియా అమ్మకాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఆంక్షలు విధించడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ

మిగతా 2వ పేజీలో..

## జహీరాబాద్ స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి శ్రీకారం

- మోదీ చేతుల మీదుగా మే 10న శంకుస్థాపన
- రూ.2360 కోట్లతో భారీ పారిశ్రామిక ప్రాజెక్ట్
- లక్షల ఉద్యోగాలకు నాంది, భారీ పెట్టుబడుల లక్ష్యం
- హైదరాబాద్–నాగ్‌పూర్ కారిడార్‌లో కీలక అభివృద్ధి



**హైదరాబాద్, మే 5:**
తెలంగాణలో పారిశ్రామిక రంగానికి భారీ ఊతం ఇవ్వనున్న జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌కు మే 10న ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయనున్నారు. కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు.

మిగతా 2వ పేజీలో..

## అర్హతే ప్రామాణికం..

- మూడు నెలల్లో పరిష్కారం:పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ప్రజాదర్బార్ వేదికగా సమస్యల పరిష్కారానికి అభయం
- సాదాబైనామాలకు 35 రోజుల్లోనే మోక్షం
- ప్రభుత్వ భూమిని కాజేస్తే సహించేది లేదు



**ఖమ్మం,**
ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుకు మూడు నెలల్లోపు పరిష్కారం చూపుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మం రూరల్

మిగతా 2వ పేజీలో..



## తెలంగాణ ప్రజల రక్షణ కోసమే టిఆర్ఎస్

టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట కవిత
తెలంగాణ ప్రజల రక్షణే మా పార్టీ ధ్యేయం
ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం

3


## నిజాంపేట్‌లో
# భారీ అగ్నిప్రమాదం..

- ఆరు ఫర్నిచర్ షాపులు దగ్ధం!
- వరుస ఘటనలతో టెన్షన్!

**హైదరాబాద్:**
మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. నిజాంపేట్ సర్కిల్‌లో సోమవారం

మిగతా 2వ పేజీలో..





## మళ్లీ భయపెడుతున్న
# హంటా వైరస్

క్రూయిజ్ షిప్ ఘటనతో పెరిగిన ఆందోళనలు
ఎలుకల ద్వారా వ్యాపించే ప్రమాదకర వైరస్
ఫ్లూ లక్షణాల్లానే మొదలై ప్రాణాపాయానికి దారి
జాగ్రత్తలతోనే రక్షణ..
అప్రమత్తత అవసరం


2

## గుంటూరు ముఠా హనీట్రాప్ అరాచకాలు..

- ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రిచ్ కిడ్స్ టార్గెట్
- మైనర్ బాలికలను వలలో వేసిన అన్నదమ్ములు
- లైంగిక వేధింపులు, వీడియోలతో బ్లాక్ మెయిల్
- రూ.13 లక్షలు దోచుకున్న ముఠా

**హైదరాబాద్, మే 5:**
మహానగరంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మైనర్ బాలికలను టార్గెట్ చేస్తూ హనీట్రాప్‌కు పాల్పడుతున్న గుంటూరు ముఠా అరాచకాలు వెలుగులోకి వచ్చాయి. రిచ్ కిడ్స్‌ను లక్ష్యంగా చేసుకుని వల వేస్తున్న ఇద్దరు అన్నదమ్ములను పోలీసులు అరెస్ట్ చేశారు.
గుంటూరుకు చెందిన అర్జున్ (అలియాస్ చంద్రశేఖర్ ఆజాద్), ప్రవీణ్ ఈ దారుణాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. వీరికి వారి తల్లి మీనాకుమారి సహకారం

మిగతా 2వ పేజీలో..




## యూరియా అమ్మకాలపై ఆంక్షలు దారుణం..

**మొదటిపేజీ తరువాయి**

ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఘాటైన విమర్శలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా అమ్మకాలపై ఆంక్షలు విధించడం అత్యంత దిక్కుమాలిన చర్య అని హరీష్ రావు మండిపడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియాపై ఇలాంటి ఆంక్షలు విధించడం ప్రస్తుత ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. ఎరువుల ధరలు పెరగడం ఒకవైపు, యూరియా సరఫరా నిలిపివేయడం మరోవైపు రైతులను తీవ్రంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చెరకు, పండ్ల తోటలు, కూరగాయలు పండించే రైతులు ఈ సరఫరా నిలిపివేతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ముందు 'రైతు డిక్లరేషన్' పేరిట అనేక హామీలను ఇచ్చిందని, అయితే వాటిని నెరవేర్చడంలో ఇప్పుడు పూర్తిగా విఫలమైందని హరీష్ రావు విమర్శించారు. రైతుబంధు, పంటలకు బోనస్ చెల్లింపు, రుణమాఫీ, పంట భీమా వంటి కీలకమైన వాగ్దానాలను అమలు చేయడంలో ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని ఆయన ఎద్దేవా చేశారు. రైతుల కష్టాలను తీర్చాల్సింది పోయి, సమస్యలను మరింత జటిలం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

యూరియా కొరతను పరిష్కరించడంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం, రైతులకు యూరియా వినియోగం తగ్గించాలని సూచించడం హాస్యాస్పదంగా ఉందని హరీష్ రావు విమర్శించారు. ఇటువంటి వింత సూచనలు చేయడం మానేసి, ప్రభుత్వం తక్షణమే ఈ అనాధికారిక నిషేధాన్ని ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మునుపటిలాగే ఎటువంటి ఆంక్షలు లేకుండా యూరియా అమ్మకాలను కొనసాగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.




## ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరి కన్నుమూత

- **చిత్ర పరిశ్రమలో తీరని విషాదం**
- **రాజస్థాన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం**
- **సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత దుర్మరణం**
- **నాలుగు భాషల్లో 90కి పైగా చిత్రాల నిర్మాణం..**
- **'రాజా', 'సూర్యవంశం' వంటి హిట్లతో గుర్తింపు**
- **దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, చిరంజీవి, బాలకృష్ణ**

**హైదరాబాద్**

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన ప్రముఖ సీనియర్ నిర్మాత, సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి. చౌదరి (72) మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నుమూశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆయన ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురికావడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ఈ వార్త తెలియగానే దక్షిణ భారత సినీ పరిశ్రమ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో సుమారు 90కి పైగా చిత్రాలను నిర్మించిన ఆర్.బి. చౌదరి, ఎందరో నటీనటులను, సాంకేతిక నిపుణులను వెండితెరకు పరిచయం చేశారు. ముఖ్యంగా తెలుగులో 'రాజా', 'సూర్యవంశం', 'సుస్వాగతం' వంటి క్లాసిక్ హిట్లు ఆయన నిర్మాణంలో వచ్చినవే. కేవలం భారీ చిత్రాలే కాకుండా, కుటుంబ కథా చిత్రాలకు పెద్దపీట వేస్తూ 'సూపర్ గుడ్ ఫిలింస్' బ్యానర్‌ను ఇంటి పేరయ్యేలా చేశారు. ఆయన కుమారులు జీవా, రమేష్ కూడా నటులుగా రాణిస్తున్నారు.

**ప్రముఖుల సంతాపం:**

ఆర్.బి. చౌదరి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఒక గొప్ప నిర్మాతను, మంచి మనిషిని కోల్పోయామని సినీ లోకం నివాళులర్పిస్తోంది.

## నిజాంపేట్‌లో భారీ అగ్నిప్రమాదం..

**మొదటిపేజీ తరువాయి**

అర్ధరాత్రి వేళ ఈ ఘటన జరిగింది. ఈ అగ్నిప్రమాదంలో వరుసగా ఉన్న ఆరు ఫర్నిచర్ షాపులు మంటల్లో పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దుకాణాల్లో నిల్వ ఉంచిన భారీ ఫర్నిచర్ సామాగ్రి అగ్నికి ఆహుతి కావడంతో సుమారు లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే 4 ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు సమన్వయంతో గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ మంటలు చెలరేగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణహాని కలగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



అయితే, ఇటీవల కాలంలోనే ఇదే ప్రాంతంలో మరో అగ్నిప్రమాదం జరగడం, మళ్లీ ఇప్పుడు ఇలాంటి ఘటనే జరగడంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను తెలుసుకోవడానికి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ప్రతి వేసవికాలంలో ఇదే తీరుగా నగరంలో ఏదో చోట తరచుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి.

## గుంటూరు ముఠా హనీట్రాప్ అరాచకాలు..

**మొదటిపేజీ తరువాయి**

కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆకర్షణీయ రీల్స్ చేస్తూ మైనర్ బాలికలను పరిచయం చేసుకుని, ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవనశైలితో ఆకట్టుకుని వారిని వలలో వేస్తున్నారు.

బాలికలను కార్లలో తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడుతూ, ఆ దృశ్యాలను రహస్యంగా చిత్రీకరించి తర్వాత వాటితో బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లు వెల్లడైంది. పెట్టుబడుల పేరుతో డబ్బులు వసూలు చేస్తూ బెదిరింపులకు దిగుతున్నారు. ఈ క్రమంలో ఒక మైనర్ బాలిక నుంచి రూ.13 లక్షలు దోచుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఇప్పటివరకు సుమారు 19 మంది మైనర్ బాలికలను ఈ ముఠా ట్రాప్ చేసినట్లు గుర్తించారు. నిందితుడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను పోలీసులు నిలిపివేశారు. కేసు తీవ్రత దృష్ట్యా ఉన్నతాధికారులు స్వయంగా విచారణ చేపట్టి మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనతో నగరంలో కలకలం రేగింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# ప్రాంతీయ వాదం వీడితే పతనమేనా?

**మొదటిపేజీ తరువాయి**

కలపడంపై పెట్టిన దృష్టి, క్షేత్రస్థాయిలో ప్రజల నాడిని పట్టుకోవడంలో విఫలమయ్యేలా చేసింది. అయితే, ఆ తప్పును గుర్తించిన ఆయన, మళ్ళీ లోకల్ పాలిటిక్స్‌కే పరిమితమై, బీజేపీతో వ్యూహాత్మక పొత్తు పెట్టుకుని అధికారాన్ని దక్కించుకోవడం ఒక రాజకీయ పాఠం. ప్రాంతీయ నేతలకు రాష్ట్ర ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యత అని ఆయన నిరూపించారు.

**టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్ వరకు - కేసీఆర్ పతనం**

తెలంగాణలో తిరుగులేని శక్తిగా ఉన్న కేసీఆర్, తన పార్టీ పేరును టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మార్చి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించడమే ఆయన పతనానికి ఆరంభమైంది. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అంటూ మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలపై ఫోకస్ పెట్టడం వల్ల, తెలంగాణ ప్రజల్లో తమ సమస్యలను పక్కనపెట్టి ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు అనే భావన కలిగింది. ఫలితంగా పదేళ్ల అధికారాన్ని కోల్పోవడమే కాకుండా, లోక్ సభ ఎన్నికల్లో జీరోకి పరిమితమవడంతో పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

**కేజ్రీవాల్ , ఠాక్రే - గందరగోళంలో కోటలు**

ఢిల్లీకే పరిమితమైన ఆమ్ ఆద్మీ పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించాలని అరవింద్ కేజ్రీవాల్ పడ్డ తాపత్రయం ఆయనను జైలు పాలు చేయడమే కాకుండా, పార్టీలో సంక్షోభానికి దారితీసింది. పంజాబ్ లో గెలిచినప్పటికీ, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ ప్రయత్నాలు ఢిల్లీ పాలనపై ప్రభావం చూపాయి. అటు మహారాష్ట్రలో శివసేనను జాతీయ స్థాయిలో సెక్యులర్ ఇమేజ్ కోసం మలచాలని చూసిన ఉద్ధవ్ ఠాక్రే, తన సొంత పార్టీని, ఎమ్మెల్యేలను కాపాడుకోలేకపోయారు. ఇప్పుడు అక్కడ షిండే వర్గం , బీజేపీ హవా ముందు ఠాక్రే వారసత్వం వెలవెలబోతోంది.

**మమత , స్టాలిన్ - బెంగాల్, తమిళనాడు షాక్**

ఇప్పుడు మమతా బెనర్జీ , ఎం.కె. స్టాలిన్ ఎదుర్కొన్న పరాజయం ఈ వాదనకు బలాన్నిస్తోంది. మమత గత రెండేళ్లుగా ఇండియా కూటమికి నాయకత్వం వహించాలని, త్రిపుర, గోవా వంటి రాష్ట్రాల్లో పోటీ చేయాలని చేసిన ప్రయత్నాలు బెంగాల్ పై ఆమె పట్టును సడలించాయి. స్టాలిన్ సైతం జాతీయ స్థాయిలో మోదీకి వ్యతిరేక గళం వినిపిస్తూ, ద్రవిడ మోడల్ ను దేశమంతా ప్రచారం చేయాలని చూశారు. కానీ, ప్రజలు తమ రాష్ట్రంలో ఉన్న సమస్యలను పరిష్కరించని నాయకులు జాతీయ రాజకీయాల గురించి మాట్లాడటాన్ని అంగీకరించడం లేదని ఈ ఫలితాలు తేల్చిచెప్పాయి.

**వాక్యూమ్ ను భర్తీ చేస్తున్న జాతీయ పార్టీలు**

ప్రాంతీయ నేతలు తమ దృష్టిని రాష్ట్రం దాటించిన ప్రతిసారీ, అక్కడ ఒక రాజకీయ శూన్యం ఏర్పడుతోంది. బెంగాల్ లో మమత సృష్టించిన ఆ శూన్యాన్ని బీజేపీ సమర్థవంతంగా భర్తీ చేసింది. తమిళనాడులో స్టాలిన్ వదిలేసిన ప్రాంతీయ సెంటిమెంట్ ను విజయ్ తన తమిళగ వెట్రి కళగం ద్వారా సొంతం చేసుకున్నారు. ప్రాంతీయ పార్టీలు తమ మౌలిక సిద్ధాంతాలను, స్థానిక ప్రజల అవసరాలను విస్మరించి జాతీయ నాయకులుగా ఎదగాలని కోరుకోవడం వల్ల.. అటు జాతీయ స్థాయిలో స్థానం దక్కక, ఇటు సొంత రాష్ట్రంలో అధికారం కోల్పోయే పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా మారుతున్నాయి.

# అర్హతే ప్రామాణికం..

**మొదటిపేజీ తరువాయి**

మండలం మంగళగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి ఆయన పాల్గొని, బాధితుల నుంచి స్వయంగా విన్నపాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తంటాలతో రైతులు పడుతున్న ఇబ్బందులను తాము భూ భారతి ద్వారా తొలగిస్తున్నామని తెలిపారు.ముఖ్యంగా సాదాబైనామా దరఖాస్తులను అర్హత మేరకు రాబోయే 35 రోజుల్లో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అయితే, సాదాబైనామా పేరుతో ప్రభుత్వ భూములను కాజేయాలని చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, అటువంటి దరఖాస్తులను తిరస్కరిస్తామని గట్టిగా హెచ్చరించారు.

**ప్రజల ముంగిటకే ప్రజా పాలన**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలు, మహిళలు, నిరుద్యోగ యువత పక్షాన ప్రభుత్వం నిలబడుతుందని మంత్రి పొంగులేటి పునరుద్ఘాటించారు. ఇప్పటి వరకు నిర్వహించిన 7 క్లస్టర్ల పరిధిలో వచ్చిన పది వేల దరఖాస్తులలో 5 వేల వరకు ఇందిరమ్మ ఇళ్ల కోసమే రావడం ప్రజల అవసరాన్ని సూచిస్తోందని, వీటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ల తొలగింపు, కొత్త రేషన్ కార్డుల మంజూరు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్ , వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## శంషాబాద్‌లో ఐటీపీ ఏరో ఇండియా కేంద్రానికి శ్రీకారం..

**మొదటిపేజీ తరువాయి**

ప్రారంభించారు. సుమారు రూ.453 కోట్ల పెట్టుబడితో 10 ఎకరాల్లో ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారు. తెలంగాణను ఏరోస్పేస్, ఆధునిక తయారీ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక అడుగుగా అధికారులు పేర్కొన్నారు. ఈ తయారీ కేంద్రం 2027 నాటికి పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించనుంది. ప్రారంభ దశలోనే సుమారు 350 మంది నైపుణ్య ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనుండగా, తరువాతి దశల్లో ఈ సంఖ్య దాదాపు 600కు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ప్రెసిషన్ ఇంజినీరింగ్, ఆధునిక తయారీ, నాణ్యత నియంత్రణ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. రాష్ట్ర యువతకు ఉన్నత స్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఈ ప్రాజెక్ట్ కీలకంగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది.

పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తూ సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. తెలంగాణను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీకి శ్రీకారం..

**మొదటిపేజీ తరువాయి**

హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ మొత్తం రూ.2360.54 కోట్ల వ్యయంతో అమలు కానుంది. సుమారు 3,245 ఎకరాల్లో విస్తరించనున్న ఈ స్మార్ట్ సిటీ ఆధునిక మౌలిక వసతులతో కూడిన సమగ్ర పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందనుంది.



ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 2029 నాటికి దాదాపు 1.74 లక్షల ఉద్యోగాలు సృష్టించబడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

లాజిస్టిక్స్, ఆటో భాగాలు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు, లోహాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. స్మార్ట్ టెక్నాలజీతో కూడిన మౌలిక వసతులు, పర్యావరణ హిత అభివృద్ధి విధానాలు ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకతగా నిలవనున్నాయి. ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక సదుపాయాలతో పాటు నివాస, వాణిజ్య ప్రాంతాలు, పాఠశాలలు, శిక్షణ కేంద్రాలు వంటి సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

వ్యూహాత్మకంగా హైదరాబాద్-నాగ్‌పూర్ కారిడార్‌లో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రధాన తయారీ, లాజిస్టిక్స్ హబ్‌గా మారనుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ తెలంగాణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనుంది

## ఆ కుర్రాడు.. డీఎంకే కోటను కూల్చాడు!

- **తలపతి చిన్ననాటి ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్**
- **ఆర్జీవీ పోస్ట్‌పై దేశవ్యాప్త చర్చ**
- **స్టాలిన్ సొంత గడ్డపైనే విజయ్ సునామీ**
- **ఒక్క ఫోటో.. వేల కథనాలు**

**తెలంగాణ బ్యూరో**

ఒక ఫోటో వెయ్యి పదాలతో సమానం అంటారు.. కానీ ఇప్పుడు ఒక ఫోటో దేశ రాజకీయాల్లో లక్షలాది కథనాలకు కేంద్ర బిందువైంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమిళగ వెట్రి కళగం పార్టీతో నటుడు విజయ్ సృష్టించిన రాజకీయ సునామీ ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో సంచలన దర్శకుడు రాంగోపాల్ వర్మ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తోంది. అప్పట్లో డీఎంకే అధినేత, దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి వెనుక ఒక సాధారణ కుర్రాడిగా నిలబడి ఉన్న విజయ్ ఫోటోను వర్మ షేర్ చేశారు. కరుణానిధి వెనుక కనిపిస్తున్న ఈ కుర్రాడు భవిష్యత్తులో అదే పార్టీని ఓడిస్తారని ఎవరైనా ఊహించారా? కరుణానిధి కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి స్టాలిన్.. ఈ కుర్రాడి రాజకీయ ప్రభంజనంలో తన సొంత నియోజకవర్గంలోనే ఓటమి పాలవుతారని ఎవరైనా అనుకున్నారా? అంటూ వర్మ తనదైన శైలిలో కామెంట్స్ చేశారు.

**రాజకీయ ముఖచిత్రం మార్చిన విజయ్**

తమిళనాడు ఎన్నికల్లో మొదటి ప్రయత్నంలోనే టీవీకే 108 స్థానాలను కైవసం చేసుకోవడం, ఏకంగా అధికార డీఎంకేకు చుక్కలు చూపడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ముఖ్యంగా స్టాలిన్ వంటి దిగ్గజ నేతలే విజయ్ ధాటికి తలవంచాల్సి రావడం విశేషం. అప్పట్లో కరుణానిధితో దిగిన ఆ చిన్ననాటి ఫోటో ఇప్పుడు విజయ్ సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తోంది. నెటిజన్లు ఆ ఫోటోను వైరల్ చేస్తూ, కాలం ఎంత విచిత్రమైనదోనని కామెంట్లతో హోరెత్తిస్తున్నారు.



# మళ్లీ భయపెడుతున్న హంటా వైరస్

**న్యూఢిల్లీ, మే 5:**

ప్రపంచవ్యాప్తంగా మరోసారి వైరస్ భయం చర్చనీయాంశంగా మారింది. తాజాగా క్రూయిజ్ షిప్‌లో ముగ్గురు మరణించిన ఘటనతో హంటా వైరస్‌పై ఆందోళనలు పెరిగాయి. అయితే సాధారణ ప్రజలకు ప్రస్తుతం ప్రమాదం తక్కువగానే ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. హంటా వైరస్ ప్రధానంగా ఎలుకలు, వాటి మూత్రం, మలం, లాలాజలం ద్వారా మనుషులకు సంక్రమిస్తుంది. గాలిలో తేలియాడే సూక్ష్మ కణాల ద్వారా కూడా ఇది శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అడవులు, పాత భవనాలు, పొలాల్లో పని చేసే వారికి ఈ వైరస్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

ఈ వైరస్ లక్షణాలు మొదట్లో ఫ్లూ మాదిరిగానే కనిపిస్తాయి. జ్వరం, శరీర నొప్పులు, తలనొప్పి, వికారం, దగ్గు వంటి లక్షణాలు ప్రారంభంలో ఉంటాయి. కానీ తీవ్రమైన దశకు చేరితే ఊపిరితిత్తులు, మూత్రపిండాలపై ప్రభావం చూపి శ్వాస సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో మరణాల రేటు గణనీయంగా నమోదవుతున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా చైనా, రష్యా, దక్షిణ కొరియా వంటి దేశాల్లో ప్రతి ఏడాది వేల కేసులు నమోదవుతున్నాయి. అమెరికా, ఫిన్లాండ్, ఫ్రాన్స్ వంటి దేశాల్లో కూడా ఈ వైరస్ కనిపిస్తోంది. సాధారణంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించకపోయినా, కొన్ని ప్రత్యేక రకాల ద్వారా వ్యాప్తి అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.హంటా వైరస్‌కు ప్రత్యేక చికిత్స లేదు. లక్షణాల ఆధారంగా వైద్యం అందించాల్సి ఉంటుంది. తీవ్రమైన కేసుల్లో ఐసీయూ చికిత్స అవసరం అవుతుంది. త్వరగా గుర్తిస్తే కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ఈ వైరస్ నుంచి రక్షణ పొందాలంటే ఎలుకలు ఉన్న ప్రదేశాలకు దూరంగా ఉండటం, ఇళ్లను శుభ్రంగా ఉంచడం, మాస్క్, గ్లౌజులు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పెద్దగా భయపడాల్సిన అవసరం లేకపోయినా అప్రమత్తంగా ఉండటం అవసరమని హెచ్చరిస్తున్నారు.



## సంపాదకీయం

# ప్రశ్నార్థకంగా మమత నైతికత

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేయబోనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించడం ప్రజాస్వామ్య సంప్రదాయాలపై తీవ్ర చర్చకు దారితీసింది. ఎన్నికల్లో ప్రజాతీర్పును గౌరవించాల్సింది పోయి, 'రాజీనామా చేసే ప్రసక్తే లేదు' అని భీష్మించడం రాజకీయ నైతికతను ప్రశ్నిస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు స్పష్టమైన మార్పును సూచించాయి. మొత్తం 293 స్థానాలకు గాను భారతీయ జనతా పార్టీ 206 స్థానాలతో ఘన విజయం సాధించగా, తృణమూల్ కాంగ్రెస్ 80 స్థానాలకే పరిమితమైంది. ప్రజలు మార్పు కోరుకున్నారని ఈ సంఖ్యలే స్పష్టం చేస్తున్నాయి. ఓటమి ఎదురైనప్పుడు ప్రజా తీర్పును శిరసావహించి హుందాగా తప్పుకోవడం ప్రజాస్వామ్య సంప్రదాయం. కానీ, మమతా బెనర్జీ తాము ఓడిపోలేదని, ఇది కేవలం 'కుట్ర' అని కొట్టిపారేయడం సరైన పద్ధతి కాదు. ఎన్నికల కమిషన్ కుట్ర పూరితంగా తమను ఓడించిందని, 90 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపించడం వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నంగా కనిపిస్తోంది.

### హుందాతనం ఎక్కడ? నైతిక విజయం అనే వాదన

స్పష్టమైన మెజారిటీ కోల్పోయిన తర్వాత కూడా 'నైతికంగా మేమే గెలిచాం' అని వాదించడం అధికారంపై ఉన్న మితిమీరిన వ్యామోహాన్ని సూచిస్తుంది. మెజారిటీ కోల్పోయిన తర్వాత ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక హక్కును ఏ నాయకుడైనా కోల్పోతారు. రాజీనామా చేయకపోవడం ద్వారా ఆమె లోక్ భవన్‌కు వెళ్లేందుకు నిరాకరిస్తూ రాజ్యాంగ సంక్షోభానికి తెరలేపుతున్నారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని భావిస్తే అందుకు చట్టపరమైన మార్గాలు, న్యాయస్థానాలు ఉన్నాయి. అంతే తప్ప, ఫలితాలనే గుర్తించబోమనడం సరైన రాజకీయం కాదు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వంటి ఇండియా కూటమి నాయకులు ఆమెకు సంఘీభావం తెలిపినప్పటికీ, బెంగాల్ ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పును కాలరాయలేరు. ప్రజాస్వామ్యంలో అధికారం శాశ్వతం కాదు. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష పాత్రను స్వీకరించి, ప్రజా సమస్యలపై పోరాడటం ద్వారా తిరిగి ప్రజల నమ్మకాన్ని గెలవడానికి ప్రయత్నించాలి. అలా కాకుండా, రాజీనామాకు నిరాకరించి మొండిగా ముందుకు వెళ్లడం మమతా బెనర్జీ సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి తీరని నష్టం కలిగిస్తుంది. ఇప్పటికైనా ఆమె పంతాన్ని వీడి, ప్రజా తీర్పుకు తలవంచి గౌరవప్రదంగా తప్పుకోవడమే బెంగాల్ హితవుకు, ప్రజాస్వామ్యానికి మంచిది

# వధూవరులను ఆశీర్వదించిన ఆడే గజేందర్



**బజార్హత్నూర్(సిరి న్యూస్ ):** బజార్హత్నూర్ మండలంలోని గులాబ్ తండా గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాథోడ్ నందు సోదరుడు రాథోడ్ కమల్ సింగ్ కుమారుడి 'టీల' వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడే గజేందర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గ్రామానికి చేరుకున్న ఆడే గజేందర్కు పార్టీ శ్రేణులు, కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తొడసం నాందేవ్, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టైరు బ్లాస్టై కారు బోల్తా

## డ్రైవర్ మృతి



**తాండూర్(సిరి న్యూస్ ):** మండలంలోని బోయపల్లి బోర్డ్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందాడు. మృతుడిని అంబాడే దినేష్ (50) మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా రాజురా తాలూకా రాంపూర్ గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. ఎస్సై కె.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. దినేష్ తన స్నేహితులు రేబవర్ రమేష్ మహంకాళి, రేబవర్ సునీతలతో కలిసి మంచిర్యాలలో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. కారు ముందు ఎడమ టైరు అకస్మాత్తుగా పేలడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న దినేష్కు తీవ్ర గాయాలు కాగా, మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ దినేష్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు హర్షల్ దినేష్ అంబాడే ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు..

# రైతు సమస్యలపై ప్రభుత్వానికి కేటీఆర్ అల్టిమేటం



**జనగామ:**
రైతు సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. జనగామ పర్యటనలో భాగంగా యశ్వంతపూర్ గ్రామంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.
ధాన్యం కొనుగోలులో 15-20 రోజులుగా జాప్యం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్, కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు.
రాష్ట్రంలో 14 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పండించినా, కొనుగోలు ప్రణాళికలు సరిపడా లేవని ఆరోపించారు. కేవలం 10 లక్షల టన్నుల కొనుగోలుతో మిగతా పంటను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఆలస్యం వల్ల వర్షాలకు పంట దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని చెప్పారు.
మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం భారీ అప్పులు తెచ్చిందని, సివిల్ సప్లైలో సమస్యలతో నిధుల వినియోగం మారిందని పేర్కొన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

# చురుకుగా రబీ ధాన్యం సేకరణ

- మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలి
- ధాన్యం తరలించేందుకు లారీలు పెంచాలి
- నల్లగొండలో ఆకస్మికి పర్యటన చేసిన స్టీఫెన్ రవీంద్ర

**నల్లగొండ, మే 5:**
రబీ ధాన్యం సేకరణలో భాగంగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. అన్‌లోడింగ్ తోపాటు, వెహికల్ రోటేషన్, కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యం తరలించడం,లారీలు, హమాలీలను పెంచాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఆయన నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, పెద్దకాపర్తి లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదకాపర్తి కేంద్రానికి ఇప్పటివరకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ,ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు, టార్పాలిన్లు, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, కేంద్రం నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. కాగా ఇప్పటివరకు ఈ కేంద్రానికి 25 వేల క్వింటాళ్ల దాన్యం వచ్చిందని, ఇందులో 7000 క్వింటాళ్లు కొనుగోలు చేయడం జరిగిందని, ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తి చేశామని, ఇంకా కొనుగోలు కేంద్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. పెదకాపర్తి కేంద్రం పెద్ద సెంటర్ అయినందున అన్ని పెద్ద సెంటర్లలో 10 నుండి 20 వరకు ఎక్ట్రా లారీలు ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సివిల్ సపె□ేల కమిషనర్ కు వివరించారు. హమాలీల కొరత లేకుండా మిల్లర్లకు ముందే సమాచారం ఇవ్వడం జరిగిందని, ఒక్కొక్క కొనుగోలు కేంద్రంలో 30 వరకు హమాలీలు ఉన్నారని, అదేవిధంగా మిల్లుల్లో సైతం 30 నుండి 35 వరకు హమాలీలను ఉంచడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ కమిషన్ మాట్లాడుతూ ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రపరిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల వివరాలను, టార్పాలిన్లను అడిగారు. అవసరమైతే ఎక్ట్రా టార్పాలిన్లు కొనుగోలు కేంద్రాలలో పెట్టాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ వట్టిమర్తిలో ఉన్న సిద్దార్థ రైస్ ఇండస్ట్రీస్ ను సందర్శించి అక్కడ ఎంత మంది హమాలీలు ఉన్నారని అడగగా 35 మంది ఉన్నారని తెలిపారు. ఆన్ లోడింగ్, వెహికల్ రోటేషన్ పెంచాలని చెప్పారు.అంతేకాక సిస్టం ద్వారా ధాన్యం వివరాల అ□`లోడింగ్ ,ట్యాబ్ ఎంట్రీ వివరాలను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. ట్యాబ్ ఎంట్రీ పెండింగ్ ఉన్న కొనుగోలు కేంద్రాలపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, మిల్లులలో స్థలం లేకుంటే ఇంటర్మీడియట్ గోడౌన్లకు తరలించాలని, ధాన్యం తరలింపు తో పాటు, మరిన్ని వాహనాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్పోర్ట్ శాఖ డిప్యూటీ కమిషనర్ వాణిని సివిల్ సపె□లస్ కమీషనర్ ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ రోహిత్ సింగ్, జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, పౌరసరఫరాల శాఖ జీఎం నాగేశ్వర రావు, ట్రాన్స్పోర్ట్ డిప్యూటీ కమిషనర్ వాణి, పౌరసరఫరాల శాఖ వెంకటేశం జిఎం. రాంపతి నాయక్, డిసిఓ పత్యా నాయక్, మార్కెటింగ్ శాఖ ఎడి ఛాయాదేవి, చిట్యాల తహసిల్దార్ విజయ్, తదితరులు ఉన్నారు.

# మహిళ మెడలో గొలుసు చోరీ ఘటన

- ధైర్యంగా అడ్డుకున్న ఆటో డ్రైవర్
- ఆటో డ్రైవర్‌ను అభినందించి సన్మానించిన సిపి

**హైదరాబాద్, మే 5:**
ఓ సామాన్య ఆటో డ్రైవర్ అసామాన్య ధైర్య సాహసాలు ప్రదర్శించాడు. మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోతున్న రౌడీ షీటర్‌ను తన ఆటో సాయంతో అడ్డుకున్నాడు. కర్రతో దాడి చేస్తున్నా బెదరకుండా అతడిని పట్టుకున్నాడు. రౌడీ షీటర్ అరెస్ట్ అవ్వడానికి ఎంతో కృషి చేశాడు. ఆటో డ్రైవర్ ధైర్యసాహసాలకు సరైన గుర్తింపు దక్కింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆటో డ్రైవర్ను సన్మానించారు. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. మార్చి 4వ తేదీ తెల్లవారుజామున బేగం బజార్ జీన్సీ చౌరాహా ప్రాంతంలో మంజు ఓమ్లతా తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. హిందీ మర్వాడీ విద్యాలయ స్కూల్ వద్ద ఊహించని పరిణామం చోటుచేసుకుంది. డబీర్‌పురకు చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సోహేల్ ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో అతడి స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయింది. బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జాహెర్ సైడ్ వ్యూ మిర్రర్ ద్వారా ఆ దృశ్యాన్ని చూశాడు. వెంటనే ఆటోను రివర్స్ చేశాడు. రౌడీ షీటర్ స్కూటీని పైకి లేపి అక్కడినుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. జాహెర్ ఆటోతో స్కూటీని ఢీకొట్టాడు. దీంతో మహ్మద్ సోహేల్ కిందపడిపోయాడు. జాహెర్ వెంటనే కిందకు దిగి సోహేల్‌ను పట్టుకున్నాడు. తర్వాత అటు వైపు వెళుతున్న వారు కూడా జాహెర్‌కు సాయం చేశారు. రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించారు. అనంతరం జాహెర్ అక్కడినుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఎలాంటి ప్రతిఫలం ఆలోచించకుండా.. తన ప్రాణాలకు తెగించి రౌడీ షీటర్‌ను పోలీసులకు పట్టించిన జాహెర్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం బంజారాహిల్స్, టీజీఐసీసీసీలోని తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంసా పత్రంతో పాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో గోల్కొండ జోన్ డీసీపీ జీ చంద్ర మోహన్, గోషామహల్ ఎస్‌హెచ్ఓ శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణహిత చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి

- పోలవరంకు జాతీయ హోదా ఇచ్చి, తెలంగాణను విస్మరిస్తే ఎలా
- ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వక పోవడం వివక్షే
- ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం సరికాదు
- నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమే
- పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ప్లాంట్‌లకు సరఫరా
- ప్రధాని మోడీకి భట్టి విక్రమార్క విజ్ఞప్తి

**రాజన్నసిరిసిల్ల, మే 5:**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డిజైన్ చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత`చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. సిరిసిల్లా జిల్లా గంబిరావుపేట గ్రామాంలోని పంతులుగారి తోటలో బయోస్ట్రాట్రమ్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటేడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంగళవారం డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణలోని ఒక ప్రధాన సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని నాటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందని ఆయన గుర్తు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినప్పటికీ, తెలంగాణలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా ఆ హోదా కల్పించకపోవడం తెలంగాణ రాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షతకు నిదర్శనమన్నారు. తెలంగాణలో రైతులు పండించే ప్రతి పంటను కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోకుండా కొర్రీలు పెట్టడం, నిధుల విడుదలలో జాప్యం చేయడం రైతుల్ని మోసం చేయడమేనని ఆయన విమర్శించారు. కేవలం కొన్ని పంటలకే మద్దతు ధర ప్రకటించి మిగిలిన వాటి విషయంలో కేంద్రం తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్రం సేకరించిన ప్రతి గింజను కేంద్రమే సేకరించి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతులకు అనేక రకాల ప్రోత్సహకాలు అందించి రైతులకు అండగా నిలబడిందన్నారు. వ్యవసాయ రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ వరి గడ్డిని ముడిసరుకుగా ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బృహత్తర ఆలోచనను కాంగ్రెస్ ప్రభుత్వం కార్యరూపంలోకి తెస్తోందన్నారు. సాధారణంగా పంట కోతల అనంతరం రైతులు పొలాల్లోనే గడ్డిని కాల్చివేయడం వల్ల వాతావరణం కలుషితమై ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ పడిపోతున్న తరుణంలో, ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. దీనివల్ల పర్యావరణానికి రక్షణ కలగడమే కాకుండా, రైతులకు వ్యర్థాల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో, అభివృద్ధి చెందిన దేశాల బాటలో మన రైతాంగం కూడా అడుగులు వేయాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందన్నారు. సమాజానికి ఆహారాన్ని అందించే రైతు, ఆరోగ్యకరమైన గాలిని కూడా అందించాలనే ఉద్దేశంతో పంట వ్యర్థాలను కాల్చకుండా బయో గ్యాస్ ఎ□`లాంట్‌లకు సరఫరా చేయాలని కోరారు. మరోవైపు, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని రైతులు పాటించాలని కోరారు. కేవలం వరి మీదనే ఆధారపడకుండా ఉద్యానవన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి లాభదాయకమైన పంటల వైపు రైతులు దృష్టి సారించినప్పుడే ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని తెలిపారు. వీటి సాగు వల్ల రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి పోషక విలువలతో కూడిన ఆహారం అందించిన వారవుతారని చెప్పారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, పండించిన ప్రతి గింజకూ కనీస మద్దతు ధర కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉందని. మద్దతు ధర ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో కొనుగోలు పక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన వ్యవస్థను ఏర్పుట చేసిందన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని, ఈ మార్పులో రైతులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

# ప్రధాని పర్యటనలో భారీ భద్రత

**హైదరాబాద్, మే 5:**
ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మే 10వ తెలంగాణలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు ఆదేశించారు. అలాగే తగిన భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడా పొరపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి పర్యటనకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను ఆయన సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధానమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. దీంతో పాటు అదేరోజు బహిరంగసభలో పాల్గొననున్నారు. అందుకు అనుగుణంగా బ్లూ బుక్ ప్రకారం తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతలు, ట్రాఫిక్, బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీసుశాఖకు ప్రధాన కార్యదర్శి సూచించారు. బేగంపేట్ విమానాశ్రయం, హెలిప్యాడ్‌లతో పాటు అన్ని వేదికల వద్ద తగినన్ని అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాలని ఫైర్ సర్వీసెస్ శాఖ అధికారులను, అవసరమైన వైద్య సదుపాయాలు కూడా ఏర్పాటు చేయాలని, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి కాన్వాయ్ పర్యటించే మార్గాలలో రోడ్లను పరిశీలించాలని ఏ వైన మరమ్మత్తులు ఉంటే యుద్ధప్రాతిపధికన పూర్తి చేయాలని పోలీసు, ఉఊఓఅ, రోడ్లూ భవణాల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రధాని పర్యటించే అన్ని ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, ప్రధానమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ , నవీన్ మిట్టల్, దానకిషోర్, వాణిప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, ఇంటిలిజెన్స్ అడిషనల్ డిజి అనిల్ కుమార్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లు విసి సజ్జనార్, రమేష్ , సుమతి, ఫ□ర్ సర్వీసెస్ డీజీ, విక్రమ్ సింగ్ మన్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 9 రాష్ట్రాల్లో ఆపరేషన్ ఆక్టోపస్

**హైదరాబాద్, మే 5 :**
హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఆపరేషన్ ఆక్టోపస్ 2.0తో పేరుతో భారీ ఎత్తున దాడులు నిర్వహించారు. తొమ్మిది రాష్ట్రాల్లో ఈ ఆపరేషన్లు నిర్వహించి.. 56 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బ్యాంక్ సిబ్బందితోపాటు పట్టుబడ్డ నిందితులకు 101 కేసులతో సంబంధం ఉన్నట్లు పోలీసులు నిర్దారించారు. అలాగే అరెస్ట్ అయిన వారిలో 32 మంది బ్యాంక్ మేనేజర్లు, కేవైసీ అప్రూవర్లు, రిలేషన్‌షిప్ మేనేజర్లతోపాటు ఫీల్డ్ ఆఫీసర్లు ఉన్నారు. అదే విధంగా 15 మంది అకౌంట్ హోల్డర్లతో పాటు, 9 మంది అకౌంట్ ఆపరేటర్లను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరందరికీ 101 కేసులతో సంబంధం ఉందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో బాధితులకు రూ. 69.99 లక్షలు రీఫండ్ చేశారు. ఈ 101 కేసుల్లో బాధితుల నుంచి రూ. 9.13 కోట్ల నగదును నిందితులు కొట్టేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇక అరెస్టయిన వారిలో 17 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వారని పోలీసులు వివరించారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 30 మంది, డిజిటల్ అరెస్ట్ కేసులో ఒకరిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

# కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడ బిడ్డలకు వరం





- **మెదక్ శాసనసభ్యులు**
- **మైనంపల్లి రోహిత్ రావు..**
- **96,11,136 కోట్ల రూపాయల**
- **చెక్కుల పంపిణీ ...**

**రామాయంపేట, మే 6( సిరి న్యూస్)**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, గత ప్రభుత్వంలో మహిళలు చాలా ఇబ్బందులు పడ్డారని మెదక్ శాసన సభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్ తెలిపారు. రామాయంపేట మండల కేంద్రంలో రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామాయంపేట మండలంలో మొత్తం 96 చెక్కలకు గాను 96,11,136 కోట్ల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు ఒక వరమని పేద కుటుంబాలపై పెళ్లి భారాన్ని తగ్గించడం కోసమే కళ్యాణ లక్ష్మి పథకం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ వచ్చాక అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తుందని తెలిపారు. తాను ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు దశలవారీగా నెరవేర్చు తున్నట్లు తెలిపారు. గతంలో 10 సంవత్సరాల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రామాయంపేట పట్టణం వెనుకబాటుకు అప్పటి కెసిఆర్ ప్రభుత్వం అన్నారు. ఈ సమావేశంలో తహసిల్దార్ రజనీకుమారి, మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు, వైస్ చైర్మన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు దేవుని రంజిత్, పుట్టి సందీప్, గజవాడ నాగరాజు గుప్తా, రవి, కో ఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, చింతల రాధా భవాని యాదగిరి, మహమ్మద్ గౌస్ పాషా, సర్పంచ్ లు మానేగళ్ళ రామ కిష్టయ్య, బక్కయ్య గారి యాదగిరి, నవీన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ ,పట్టణ పార్టీ అధ్యక్షుడు చింతల స్వామి, నాగులు గౌడ్, రమేష్ చారితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలల హక్కులను కాపాడాలి





- **బాలల హక్కుల పరిరక్షణ, మెరుగైన విద్య, ఆరోగ్యం,అందించాలి**
- **బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి**

**నర్సాపూర్ మే 5, (సిరి న్యూస్):**

బాలల సంరక్షణ కేంద్రాల పనితీరు మరింత మెరుగుపడే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టారు మంగళవారం నర్సాపూర్ పట్టణంలో బాలల సంక్షేమ హక్కుల కేంద్రాన్ని వికాసం వికలాంగుల పూనరావస కేంద్రం ను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి పరిశీలించారు బాల బాలికల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యల పై అడిగి తెలుసుకున్నారు. సీతా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాలల హక్కుల పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి సారిస్తుందని కమిషన్ సభ్యులు జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ బాలల హక్కుల ఉల్లంఘనలు, పౌష్టికాహార లోపంరాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, మెరుగైన విద్య, ఆరోగ్యం, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం పిల్లలపై దాడులను అరికట్టడానికి కమిషన్ కట్టుబడి ఉందని,ప్రతి 6 నెలలకు లేదా ఏడాదికి ఒకసారి సంరక్షణ కేంద్రాల పనితీరును సమీక్షిస్తామని అన్నారుశారీరక వైకల్యం కలిగిన వికలాంగ చిన్నారిని చూసి చేలించిన హృదయంతో ఆ చిన్నారికి ఆపరేషన్ ద్వారా వైకల్యాన్ని సరిచేసి పౌష్టికాహారం అందించి విద్యా బుద్ధులు నేర్పించి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు.భవిత కేంద్రాలు ఆదర్శవంతంగా పనిచే స్తున్నాయని చిన్నారులకు ఆటపాటలతో కూడిన నైపుణ్యాలు నేర్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో సభ్యులు కంచర్ల వందన గౌడ్,మర్రిపల్లి చందన,ఆపర్ణ, బి.వచన్ కుమార్ కమిషన్ సభ్యులు మహిళా శ్రీ శిశు సంక్షేమ అధికారి హేమ భార్గవి, రామాయంపేట సిడిపిఓ స్వరూప,డిసిపిఓ నాగరాజు,జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుదలపై అవగాహన సదస్సు

**చేర్యాల రూరల్, మే 05:**

ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా ఉద్యానపంటల సాగును ప్రోత్సహిస్తూ ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంపుదల దిశగా మంగళవారం బచ్చన్నపేట మండలం శ్రీనివాస గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి నేతృత్వంలో ఆయిల్ పామ్ తోటల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. జనగామ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ దేశం కావడంతో రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తూ వారి ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తోందని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతుల సంక్షేమానికి ఈ స్థాయిలో ప్రాధాన్యం ఇవ్వలేదని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పంటల మార్పిడి చేపట్టాలని, లేకపోతే భూములు సారాన్ని కోల్పోయి నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని సూచించారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ పంట రైతులకు స్థిరమైన ఆదాయం ఇచ్చే లాభదాయక కమర్షియల్ పంటగా నిలుస్తుందని, ఎకరానికి సుమారు లక్ష యాభై వేల రూపాయల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. అదనంగా ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ఎకరానికి రూ.42,000 వరకు ఆర్థిక సహాయం అందజేస్తోందని, ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా అందించడంతో పాటు వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ కూడా కల్పిస్తున్నదని తెలిపారు. అలాగే ఆయిల్ పామ్ సాగులో అనుసరించాల్సిన పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు వంటి అంశాలపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.



# నవోదయలో సీటు సాధించిన విద్యార్థి

**మునిపల్లి, మే 5 (సిరి న్యూస్):**



మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న జె. హర్షవర్ధన్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీటు సాధించాడు.ఈ విజయానికి పాఠశాల ఉపాధ్యాయుల కృషి కీలకంగా నిలిచింది. ముఖ్యంగా హెడ్మాస్టర్ ఎస్.వి. రమణ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అందించిన శిక్షణ, మార్గదర్శకత్వం హర్షవర్ధన్ విజయానికి దోహద పడింది. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మత్స్యశాఖ అధ్యక్షులు గా మద్దూరి లక్ష్మణ్

**గుమ్మడిదల, మే 5 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ గ్రామంలో ముదిరాజ్ మత్స్యశాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి చక్రధర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు మత్స్య శాఖ అధ్యక్షులుగా మద్దూరు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు రొయ్యపల్లి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా యాట రమేష్, మత్స్యశాఖ సలహాదారుడు మద్దూరి సత్య నారాయణ, డైరెక్టర్లు మద్దూరి శ్రీనివాస్, మద్దూరి సాయిరాం, యాట రాము, తలారి పవన్, ఇస్తారి ఆంజనేయులును ఎన్నికయ్యారు



# వేసవిలో నీటి సమస్యలకు చెక్

### ముందస్తు ప్రణాళికలతో చర్యలు వేగవంతం

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దిశానిర్దేశం



**రామచంద్రపురం (పటాన్చెరు), మే 5 (సిరి న్యూస్):**

వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటి కొరత తలెత్తకుండా ముందుగానే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి అధికారులను ఆదేశించారు.మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలో అమీన్పూర్, పటాన్చెరు సర్కిళ్ల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీల్లో ఎక్కడా నీటి సరఫరా అంతరాయం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.క్షేత్ర స్థాయిలో అధికారులు నిరంతరం పర్యటిస్తూ పరిస్థితులను సమీక్షించాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని సూచించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్లు త్రవ్వడం, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని ఆదేశించారు. అభివృద్ధి చెందుతున్న కొత్త కాలనీల్లో పైపులైన్‌ల విస్తరణపై దృష్టి పెట్టాలని తెలిపారు.జలమండలి అధికారులు స్పందిస్తూ సమస్యాత్మక ప్రాంతాల్లో చర్యలు ప్రారంభించామని, కొత్త బోర్లు త్రవ్వడం, నిల్వ ట్యాంకుల శుభ్రపరిచే పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో డీజీఎంలు శివకుమార్, శ్రీనివాసరావు, మేనేజర్లు ప్రవీణ్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దు

### వాహనదారులకు ఇబ్బంది ప్రమాదాలు జరిగే అవకాశం

**నర్సాపూర్ మే 05, (సిరి న్యూస్):**



రైతులు ధాన్యాన్ని రోడ్ల పై ఎండబెట్టడం,శుభ్రపరచడం రవాణా భద్రత నియమాలు పాటించకుండా వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు రోడ్లపై ధాన్యం మార్పిడి వల్ల ప్రమాదాలు జరుగుతాయని అంశాలను వివరించారు

1. రోడ్డు మీద ధాన్యం పరచడం వల్ల వాహనాలు జారిపోయే ప్రమాదం
2. ట్రాఫిక్ ఆటంకం కలిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని
3. అత్యవసర సేవల వాహనాలు వెళ్లడంలో అంతరాయం
4. రహదారి వినియోగ నిబంధనలు ఉల్లంఘన
5. ధాన్యాన్ని రోడ్డుపై ఆర బెట్టడం వలన ప్రమాదాల పెరుగుతాయని వివరించారు

ప్రజల రవాణా భద్రత దృష్ట్యా ప్రభుత్వం ప్రధాన రహదారులు, గ్రామ రహదారులు, అంతర్గత రహదారులపై ధాన్యాన్ని మార్పిడి చేయరాదు. ధాన్యాన్ని ఎండబెట్టడం, శుభ్రపరచడం వంటి పనులు మీ వ్యవసాయ భూములలో గ్రామ పంచాయతీ నిర్ణయించిన ప్రదేశాల్లో చేయాలని నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు

## జూదంపై పోలీసుల ఉక్కుపాదం

### ఐదుగురు అరెస్ట్ రూ.37,335 స్వాధీనం



**మెదక్ మే,05(సిరిన్యూస్)**

మెదక్ పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో బొమ్మా బొరుసు జూదం ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.నిందితుల వద్ద నుంచి రూ.37,335 నగదు, 6 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ధర్మకర్ వెంకట్, హుస్సేన్, శేఖర్, రంగారాం, రాజు లను అరెస్ట్ చేసమన్నారు.ఈ ఘటనపై మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా జూదం కార్యకలాపాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

# గీతం సైన్స్ కోర్సుల అడ్మిషన్ టెస్ట్ మే 17న

GITAM
DEEMED TO BE UNIVERSITY

**రామచంద్రపురం (పటాన్చెరు), మే 5 (సిరి న్యూస్):**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ యూజీ, పీజీ కోర్సుల ప్రవేశాల కోసం మే 17న గాట్-2026 (మూడో దశ) నిర్వహించనుంది. అభ్యర్థులు మే 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.యూజీ స్థాయిలో బీఎస్సీ (ఆనర్స్), కంప్యూటర్ సైన్స్ & కాగ్నిటివ్ సిస్టమ్స్, బి-ఆప్టోమెట్రీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. బి-ఆప్టోమెట్రీ కోర్సును ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్వహిస్తున్నారు.పీజీ స్థాయిలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరిశోధన, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యాలు విద్యార్థులకు లభిస్తాయని పేర్కొన్నారు.దరఖాస్తులు, ఇతర వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ www.gitam.edu ను సందర్శించాలి లేదా హెల్ప్‌లైన్ 888 498 4000ను సంప్రదించాలని డాక్టర్ రెజా సూచించారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**రామచంద్రపురం (పటాన్చెరు), మే 5 (సిరి న్యూస్):**

"అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందేలా కట్టుబడి ఉన్నాం" అని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రామచంద్రాపురం, పటాన్చెరు, అమీన్పూర్ మండలాలకు చెందిన 226 మంది లబ్ధిదారులకు రూ.2.26 కోట్ల విలువైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల్లో ఆడపిల్ల పెళ్లి భారాన్ని తగ్గించేందుకు ఈ పథకాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, ప్రతి అర్హుడికి ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు

# గుంతపల్లిలో రేణుక ఎల్లమ్మ ఆలయా మొదటి వార్షికోత్సవం

**గ్రామ దేవతల కటాక్షలతో ప్రజలకు మోక్షం**

**హాజరైన టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి**



**కొండాపూర్ మే5( సిరి న్యూస్)**

గ్రామదేవతల కరుణాకటాక్షాలతోని ప్రజలకు మోక్షం కలుగుతుందని టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం గుంతపల్లిలోని రేణుక ఎల్లమ్మ ఆలయా మొదటి వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలిచిన భక్తులకు కొంగుబంగారంగా అమ్మవారి ఆశీస్సులు అందుతాయని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని. హిందూ సంస్కృతిక సంప్రదాయాలకు మెట్టినిల్లుగా ప్రపంచంలోనే భారతదేశ పౌరులు నిలుచారన్నారు దైవభక్తితో కొలిచిన ప్రతి ఒక్క భక్తునికి అమ్మవారు మోక్షం కలుగుతుందన్నారు. మహోత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తులు మధ్య జరుపుకోవడం గ్రామానికి శుభ పరిణామం అన్నారు.ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, ఆలయ నిర్మాణ దాత రామచంద్ర గౌడ్,మాజీ సర్పంచ్ హన్మంత్ రెడ్డి,మాజి ఎంపిటిసి నరసింహారెడ్డి మాజీ పిఎసిఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్ వాడీలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

- బాధ్యత రహితంగా వ్యవరించవద్దు
- అద్దె భవనాలు వద్దు..స్వంత భవనాలు ముద్దు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ
- జోగిపేటలో స్మార్ట్‌ఫోన్లు, స్కూటీల పంపిణీ



**జోగిపేట, మే 05 (సిరి న్యూస్):**

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న అంగన్ వాడీ లకు అండగా ప్రభుత్వం ఉంటుందని, అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, ఆయాలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కనబడితే ప్రభుత్వం ఉపేక్షించబోదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. మంగళవారం జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్దుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జోగిపేట– ఆందోల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ గార్డెన్‌లో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా, టీచర్ల పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాబోయే రోజుల్లో అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అద్దె భవనాలు వద్దు, స్వంత భవనాలే ముద్దుయని అన్నారు. మహిళలు విద్యావంతులు కావాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, పోటీ ప్రపంచంలో ఎదుర్కొనాలంటే పునాదీ అంగన్‌వాడీ కేంద్రాలేనని అన్నారు. మీ సమస్యల పట్ల కూడా ప్రభుత్వం సానుకూలంగానే ఉందన్న అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేసారు. అదేవిధంగా, అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు.

**దివ్యాంగులకు ఉచిత స్కూటీల పంపిణీ**

10 మంది దివ్యాంగులకు ఉచిత స్కూటీలు, 286 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లను మంత్రి దామోదర రాజనర్సింహ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఎ.చిట్టిబాబు, అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి లలిత కుమారి, డీఎంహెచ్ఓ వసంత్‌రావు, మార్కెట్ చైర్మన్ ఎం.జగన్మోహన్‌రెడ్డి, పిసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, మున్సిపల్ కమిషనర్ రవీందర్, జోగిపేట సీడీపీఓ ప్రియాంక, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, టీచర్లు, దివ్యాంగులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**గుమ్మడిదల, ఏప్రిల్ 5( సిరి న్యూస్ ):**

దళారులకు నమ్మి రైతులు నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ కోరారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం, గుమ్మడిదల గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను చివరి గింజ వరకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. తూకం వేయడంలో జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ పూర్తి కాగానే రైతుల ఖాతాల్లో సకాలంలో నగదు జమ అయ్యేలా అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు నీడ, తాగునీరు వంటి కనీస వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. రైతులకు ఎల్లవేళలా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, తహసిల్దార్ పరమేశం, కమిషనర్ దశరథ్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో ఉమాదేవి వార్డు కౌన్సిలర్లు సోనీ రెడ్డి, పద్మ, విజయ లక్ష్మి, రాజశేఖర్, నరేందర్ రెడ్డి, మురళి, చక్రపాణి, రమేష్, కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, కిషన్, కో-ఆప్షన్ సభ్యులు నూర్జహాన్, భాస్కర్ రెడ్డి, పిఏసిఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, రైతులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# తాగునీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు

- బోరు బావుల పనులకు శ్రీకారం
- కౌన్సిలర్లు మద్ది సోనీ రెడ్డి, గిద్దె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నూతన బోరు బావుల పనులను ప్రారంభం

**గుమ్మడిదల, మే 5 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలోని దోమడుగు 9 వ కౌన్సిలర్ మద్ది సోనీ రెడ్డి, బొంతపల్లి 20వ వార్డుల్లో కౌన్సిలర్ గిద్దె విజయలక్ష్మి ఆధ్వర్యంలో నూతన బోరు బావుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రతి వార్డులో సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కార చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించడం మా ముఖ్య లక్ష్యం అన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో కొత్త బోరు బావులను ఏర్పాటు చేస్తూ సమస్యలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. పురపాలక సంఘం పరిధిలో ఎక్కడైనా నీటి ఇబ్బంది కనిపించిన వెంటనే మా దృష్టికి లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, కమీషనర్ దశరథ్, కౌన్సిలర్లు కత్తుల రమేష్, సప్పటి పద్మ, అభి శెట్టి రాజు, చక్రపాణి, సంజీవరెడ్డి, కుమార్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు సద్ది విజయభాస్కర్ రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి మద్ది శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# దోమడుగు గ్రామానికి మెరుగైన తాగునీటి సరఫరా

- ప్రత్యేక పైప్‌లైన్ పనులకు శ్రీకారం

**గుమ్మడిదల, మే 5 (సిరి న్యూస్ ):**



దోమడుగు గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా, నీటి సరఫరాను మరింత మెరుగుపరిచే దిశగా ప్రత్యేక పైప్‌లైన్ పనులు ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో మెల్లకుంట నుండి గ్రామంలోని నీటి సంపు వరకు ప్రత్యేక వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేసే పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దోమడుగు గ్రామంలో తాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు చర్యలుగా ఈ పైప్‌లైన్ పనులు చేపట్టబడినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ప్రాంతంలో నీటి సరఫరా సమర్థంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఎక్కడైనా సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే తమ పాలన యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్యారెడ్డి, మున్సిపల్ కమీషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు సోనీ రెడ్డి, విజయలక్ష్మి, పద్మ, రాజశేఖర్, చక్రపాణి, కుమార్ గౌడ్, సంజీవ రెడ్డి, రమేష్, కోఆప్షన్ సభ్యులు భాస్కర్ రెడ్డి, నాయకులు శేఖర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, మహేష్ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రాణహిత-చేవెళ్లకు జాతీయ హోదా కల్పించాలి





- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం తీసుకోవాలి
- ఆధునిక సాగు పద్ధతులతోనే వ్యవసాయం పండుగలా మారుతుంది
- గంభీరావుపేటలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన

**గంభీరావుపేట(సిరి న్యూస్ ):** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తక్షణమే జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం తోటలో బయోస్ట్రాటమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి భూమి పూజ చేశారు. అలాగే సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లో రూ.30 కోట్ల వ్యయంతో 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కేంద్రం పూర్తిగా కొనుగోలు చేయాలని కోరారు. తెలంగాణ రైతులు పండించే ప్రతి పంటకు కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు జరుగుతుందని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం ద్వారా పర్యావరణం దెబ్బతింటుందని, వాటిని బయోగ్యాస్ ప్లాంట్లకు సరఫరా చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఎనర్జీ దిశగా దేశం ముందుకు సాగుతున్న నేపథ్యంలో రైతులు కూడా ఈ మార్పులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పంట మార్పిడి విధానాన్ని అవలంభించాలని, వరి మీదా ఆధారపడకుండా ఉద్యాన పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్ పామ్ వంటి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అనుసరించడం ద్వారానే వ్యవసాయం పండుగలా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, డీఎస్పీ నాగేంద్రాచారి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ మల్లుగారి పద్మ తదితరులు పాల్గొన్నారు.






# తెలంగాణలోనూ కాషాయ జెండా ఎగురవేస్తాం

- నేరడిగొండలో బీజేపీ నాయకుల సంబరాలు



**నేరడిగొండ(సిరి న్యూస్ ):** ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భారతీయ జనతా పార్టీ మూడు రాష్ట్రాల్లో అఖండ విజయం సాధించిన నేపథ్యంలో మంగళవారం నేరడిగొండ మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద బాణాసంచాలు పేల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఆకుల రాజశేఖర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మోదీ నాయకత్వంపై ప్రజలకున్న నమ్మకం మరోసారి రుజువైందని హర్షం వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాల్లో బీజేపీ జెండా ఎగిరిందని, అరాచక పాలన అంతమై రామరాజ్యం సిద్ధించిందని పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయాల్లో కొత్త దిశను చూపాయన్నారు. ఇక తదుపరి లక్ష్యం తెలంగాణే అని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రాన్ని కాషాయమయం చేసేందుకు కార్యకర్తలు ఇప్పటినుంచే సమరోత్సాహంతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 'జై శ్రీరామ్' నినాదాలతో అంబేద్కర్ చౌక్ పరిసరాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గాదె శంకర్, మండల ఉపాధ్యక్షులు అడెపు రమేష్, గూడ రాజేందర్ రెడ్డి, రామగుండ్ల సురేష్, ప్రధాన కార్యదర్శి రజింత్, కార్యదర్శి జాదవ్ భీంరావ్, మాజీ సర్పంచ్ కోట్నాక్ కోటేశ్వర్, పరుశురాం జాదవ్, మాజీ ఎంపీటీసీ ధురువ రాజు, పట్టణ అధ్యక్షులు బాక్రె శేఖర్, సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి, సిడాం సంతోష్, ప్రణిత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామస్తుల తాగునీటి గోస తీర్చిన సర్పంచ్

**నేరడిగొండ(సిరి న్యూస్ ):** మండలంలోని బోరిగాం గ్రామంలో ఏళ్ల తరబడి పీడిస్తున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. గత కొన్ని సంవత్సరాలుగా సాంకేతిక కారణాలు, పైపులైన్ మరమ్మతులతో మిషన్ భగీరథ నీరు అందక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత వేసవి ఎండల తీవ్రతతో తాగునీటి ఎద్దడి మరింత ఎక్కువ కావడంతో మహిళలు నీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను సవాలుగా తీసుకున్న గ్రామ నూతన సర్పంచ్ రాథోడ్ వినేష్ ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలను పరిశీలించారు పైపులైన్లలో ఉన్న లీకేజీలను గుర్తించి, పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి అహర్నిశలు శ్రమించి, నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులను పూర్తి చేయించి గ్రామానికి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల నాటి సమస్యను తక్కువ కాలంలోనే పరిష్కరించి తమ దాహార్తిని తీర్చిన సర్పంచ్కు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# త్వరలో జీసీసీ ద్వారా జొన్నల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఆధ్వర్యంలో త్వరలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ ఉట్నూర్ డివిజనల్ మేనేజర్ గుడిమళ్ల సందీప్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా మార్క్ఫెడ్ అధికారి మహేష్ కుమార్ను కలిసి కేంద్రాల కేటాయింపుపై చర్చించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే 5 నుంచి 6 కొనుగోలు కేంద్రాలను కేటాయిస్తామని మార్క్ఫెడ్ అధికారి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు అటవీ ఉత్పత్తుల సేకరణకే పరిమితమైన జీసీసీ, ఈ నిర్ణయంతో జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు రంగంలోకి కూడా ప్రవేశించనుందని, దీంతో రైతులకు సకాలంలో పంట విక్రయించే వెసులుబాటు కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో జీసీసీ ద్వారా అటవీ ఉత్పత్తుల సేకరణ ముమ్మరంగా సాగుతోందని తెలిపారు. ఆదిలాబాద్ సొసైటీలో నిల్వ చేసిన తేనెను పరిశీలించారు. ఇప్పటివరకు 25 క్వింటాళ్ల తేనె, 122 క్వింటాళ్ల ఇప్పపువ్వు సేకరించినట్లు వివరించారు. ఆదివాసీలు, గిరిజనులు తమ ఉత్పత్తులను దళారులకు అమ్మి మోసపోకుండా, నేరుగా జీసీసీ డిపోలు, సొసైటీ కార్యాలయాల్లో విక్రయించి రశీదు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఇస్తారి, సిబ్బంది గోవిందరావు, రమేష్, సవాయి రామ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజల రక్షణ కోసమే టిఆర్ఎస్

- టిఆర్ఎస్ అధినేత్రి కల్వకుంట కవిత
- తెలంగాణ ప్రజల రక్షణే మా పార్టీ ధ్యేయం
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతాం

**తెలంగాణ బ్యూరో**

తెలంగాణ ప్రజల రక్షణ కోసమే టిఆర్ఎస్ పార్టీ పుట్టిందని పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.సిద్దిపేట జిల్లా మోతే గ్రామంలోని పురాతన రాములవారి ఆలయంలో మంగళవారం రాత్రి, పార్టీ జెండా,,కండువాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడారు.రాములవారి దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.మా పార్టీ నిరంతరం తెలంగాణ ప్రజల సేవలో నిమగ్నమై ఉండాలని స్వామివారిని కోరుకున్నారని చెప్పారు.ఉచిత విద్యా,వైద్యం,తో పాటు సామాజిక న్యాయంకోసం మేము కృషిచేస్తామని ప్రకటించారు.తెలంగాణ ప్రజలు,యువకులు,మహిళల హక్కులకోసం కృషిచేస్తామని ప్రకటించారు.అంతకుముందు గజ్వేల్ నియోజకవర్గంలోకి పలుగుగడ్డ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు.

# మక్తల్‌లో కృష్ణ జింకల వేట కలకలం

- ముగ్గురు నిందితుల అరెస్ట్..
- ఆయుధాల స్వాధీనం
- 12 జింకలు, 4 నెమళ్ల హత్య బయటపడ్డ నిజాలు
- వన్యప్రాణుల సంరక్షణపై టాస్క్ ఫోర్స్ కఠిన నిఘా

నారాయణపేట జిల్లా మక్తల్ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కలకలం రేపింది. కృష్ణ జింకలను వేటాడుతున్న ముగ్గురు వ్యక్తులను హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నిందితుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మక్తల్ ప్రాంతంలో జింకలను వేటాడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ వేటలో పాల్గొంటున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక లైసెన్స్‌డ్ రైఫిల్ తో పాటు 3 ఎయిర్ గన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుల్లో ఇద్దరు హైదరాబాద్‌కు చెందిన వారు కాగా, మరొకరు మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.
పోలీసుల విచారణలో నిందితులు విస్తుపోయే నిజాలను అంగీకరించారు. ఇప్పటివరకు తాము 12 కృష్ణ జింకలను, 4 నెమళ్లను కాల్చి చంపినట్లు నిందితులు ఒప్పుకున్నారు. కేవలం వినోదం కోసమో లేదా ఇతర అవసరాల కోసమో ఈ మూగజీవాలను బలితీసుకున్నట్లు తెలుస్తోంది. వన్యప్రాణుల సంరక్షణ కోసం పోలీసులు గట్టి నిఘా ఉంచారు. హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఈ ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ కేసును అటవీ శాఖ అధికారులకు అప్పగించి, తదుపరి విచారణను వేగవంతం చేశారు. వన్యప్రాణుల వేటకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు.. 27 మంది అధికారులకు స్థానచలనం

**హైదరాబాద్ మే05**

పరిపాలనా సౌలభ్యం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్లు, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లలతో సహా మొత్తం 27 మందిని బదిలీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. బి.హరిసింగ్ సూర్యాపేట అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా, డి. రాజ్యలక్ష్మి పెద్దపల్లి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా నియమితులయ్యారు. సంగారెడ్డి అదనపు కలెక్టర్ ఆర్. డీ. మాధురి నల్గొండ ఐ&సీఏడీ (I&CAD) స్పెషల్ కలెక్టర్గా బదిలీ అయ్యారు. టీఎల్. సంగీత సంగారెడ్డి అదనపు కలెక్టర్గా, మధు మోహన్ గద్వాల అదనపు కలెక్టర్గా పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. అదేవిధంగా నిజామాబాద్ డీఆర్వోగా బి.గీత, భద్రాద్రి కొత్తగూడెం డీఆర్వోగా ఎస్. పద్మావతి, ఆదిలాబాద్ డీఆర్వోగా బి. స్రవంతి నియమితులయ్యారు. ఎన్.రాజేందర్ రెడ్డి సిరిసిల్ల
ఆర్డీవోగా, ఎం. శర్మిల ఉట్నూర్ ఆర్డీవోగా, ఎం. విజయ కుమారి బోధన్ ఆర్డీవోగా పోస్టింగ్ పొందారు. ఎస్. రమణా రెడ్డి మిర్యాలగూడ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. సదరు అధికారులంతా తక్షణమే విధుల్లో చేరాలని, వారు బాధ్యతల నుంచి రిలీవల్ అయిన తేదీ, కొత్త చోట చేరిన వివరాలను ప్రభుత్వానికి తెలియజేయాలని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. బదిలీ అయిన వారిలో వెయిటింగ్లో ఉన్న వారు, వివిధ శాఖల్లో డెప్యుటేషన్పై ఉన్న వారు కూడా ఉన్నారు. బదిలీ అయిన ఆర్.వీ. రాధాబాయి (డిప్యూటీ కలెక్టర్) తదుపరి పోస్టింగ్ కోసం రెవెన్యూ విభాగంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

# బెంగాల్‌లో ఎంఐఎంకు భారీ షాక్..

- పోటీ చేసిన 12 స్థానాల్లోనూ డిపాజిట్లు గల్లంతు

**కొల్కతా, మే 5:**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఈ పార్టీ పోటీ చేసిన 12 స్థానాల్లోనూ అభ్యర్థుల డిపాజిట్లు కోల్పోయింది.
బీహార్ తరహాలో ముస్లిం ఓట్లను చీల్చే లక్ష్యంతో అమ్ జనతా ఉన్నాయున్ పార్టీ నేత హుమయూన్ కబీర్‌తో పొత్తు పెట్టుకున్న ఎంఐఎం వ్యూహం బెంగాల్‌లో ఏమాత్రం ఫలించలేదు. ఆశించిన మద్దతు లభించకపోవడంతో పార్టీ తీవ్రంగా నిరాశ చెందింది.
ఇదిలా ఉండగా, హుమయూన్ కబీర్‌కు సంబంధించిన స్టింగ్ ఆపరేషన్ ఈ ఎన్నికల్లో కీలకంగా మారింది. బీజేపీకి లాభం చేకూర్చేందుకు ఓట్ల చీలిక చేస్తున్నామని ఆయన వ్యాఖ్యానించడం మైనారిటీ ఓటర్లలో తీవ్ర వ్యతిరేకతను రేకెత్తించింది. ఈ వివాదం తర్వాత ఎంఐఎం ఆ పార్టీతో దూరమయ్యే ప్రయత్నం చేసినప్పటికీ, అది ప్రయోజనం ఇవ్వలేదు. ఈ పరిణామాలతో ఎంఐఎంను ఓటర్లు పూర్తిగా తిరస్కరించినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బెంగాల్ రాజకీయాల్లో తన స్థానం ఏర్పరుచుకోవాలన్న ఎంఐఎం ఆశలు ఈ ఫలితాలతో అడియాశలయ్యాయి.

# కరీంగనర్ బంగారం షాపు చోరీ

- ధర్మపురి లాడ్జిలో దొంగల బస
- సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా దొంగలను గుర్తించే పని

**కరీంనగర్, మే 5:**

కరీంనగర్‌లోని బంగారం షాపు చోరీ కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలోని ఒక లాడ్జిలో దుండగుల ముఠా బస చేసినట్లు గుర్తించారు. గోదావరి తీరం పక్కనే ఉన్న □ప్రైవేట్ లాడ్జిలో వారు రెండు రోజులు ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. మే 3వ తేదీ ఉదయం లాడ్జిని ఖాళీ చేసిన ఈ ముఠా.. బైక్‌లపై మట్టి రోడ్డు ద్వారా కరీంనగర్ చేరుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ధర్మపురి నుంచి బయలుదేరిన ఈ ముఠా.. ధర్మారం, పెగడపల్లి, రామడుగు మండలాల వి□దుగా కరీంనగర్‌కు చేరుకుందని సీసీ కెమెరాల ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ సందర్భంగా ధర్మపురిలో వీరు బస చేసిన లాడ్జిని పోలీసులు తనిఖీ చేశారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పోలీసులు జల్లెడ పడుతున్నారు. అదే సమయంలో వారి ఫోన్ కాల్స్‌ను సైతం పోలీసులు పరిశీలిస్తున్నారు. పక్కాగా రెక్కీ చేసిన తర్వాతే కరీంనగర్‌లోని పీఎంజే దుకాణంలో చోరీ చేసి.. సిబ్బందిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు.

# మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జన్మదిన వేడుకలు!!"

## నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ !!



**శివంపేట మే 5 (సిరి న్యూస్)**

మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ గారి పుట్టినరోజు సందర్భంగా, నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మరియు డాంగోరియా హాస్పిటల్ హోల్డెన్ హోమ్స్ బేతాని సంరక్షణ కేంద్రంలో శివంపేట్ ప్రభుత్వ ఆసుపత్రి కేంద్రం లో వృద్ధులకు బ్రెడ్లు.మజ్జిగ.పండ్ల పంపిణీ కార్యక్రమం లో పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మెదక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి .జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ . ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్. మాజీ జెడ్పిటిసి చౌట్టి జగదీష్.జిల్లా కార్యదర్శి రవీందర్, సీనియర్ నాయకులు రాధాకృష్ణ,శ్రీశైలం యాదవ్, కొండి దుర్గేష్,వెంకటేష్,దాడిగ నరేష్,అల్లీపూర్ శ్రీను,లక్ష్మన్, బి జి ఆర్ యువసేన నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం





**గంభీరావుపేట (సిరి న్యూస్ ):** రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు. పర్యటన సందర్భంగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ తదితరులు పాల్గొని డిప్యూటీ సీఎంకు స్వాగతం తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు.

# బాధిత రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**నేరడిగొండ(బోథ్) (సిరి న్యూస్ ):** అగ్నిప్రమాదంలో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా భరోసా ఇచ్చారు. మంగళవారం బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామాన్ని సందర్శించి అగ్నికి ఆహుతైన జొన్న, మొక్కజొన్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరు, పంట నష్టం వివరాలను రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. చేతికొచ్చిన పంట నష్టపోవడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వారికి ధైర్యం చెప్పారు. పంట నష్టంపై తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నివేదిక ఆధారంగా నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఆర్ఎస్. చిత్రు, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, తహశీల్దార్ సుభాష్ చందర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, బాధిత రైతులు ఉన్నారు.

# హైదరాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం !

- ఫార్మా, ఐటీ హబ్ గా హైదరాబాద్ కు ప్రపంచ వ్యాప్త గుర్తింపు
- మెడికల్ టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి
- దేశంలోనే అతి పెద్ద ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహణపై వాల్ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి, మే 5 (సిరి న్యూస్) :**

హైదరాబాద్ నగరంలో చిత్రపురి ఫిల్మ్ ఫెస్టివల్ వరల్డ్స్ మొదటి ఫార్మాట్, ఇండియాస్ బిగ్గెస్ట్ ఫెస్టివల్ నిర్వహణపై రూపొందించిన వాల్ పోస్టర్ ను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫార్మా, ఐటీ హబ్ గా హైదరాబాద్ కు ప్రపంచ వ్యాప్త గుర్తింపు కు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. హైదరాబాద్ లో మెడికల్ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. హైదరాబాద్ నగరానికి మిడిల్ ఈస్ట్, యూరోపియన్ దేశాలు, ఆఫ్రికా లాంటి దేశాల నుంచి పెద్ద ఎత్తున వైద్య సేవల కోసం వస్తున్నారన్నారు. ఫిల్మ్ ఫెస్టివల్స్ కి హైదరాబాద్ వేదిక కావడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నామన్నారు. దేశంలోని సినిమా, ఓటిటీ, యూట్యూబ్ లాంటి సామాజిక మాధ్యమాలలో ప్రభావితం చేసే ముఖ్యమైన వ్యక్తులందరూ హైదరాబాద్ లో జరిగే ఫిల్మ్ ఫెస్టివల్ లో పాల్గొనే విధంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించిన నిర్వాహకులను మంత్రి అభినందించారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్ లో 43 దేశాల నుండి ప్రతినిధులు హాజరు అవుతున్నారని, దేశంలో 8 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు , ఫిల్మ్ మేకర్స్ పాల్గొంటారని నిర్వాహకులు మంత్రికి వివరించారు. దేశంలో సినిమా, ఓటిటీ, ఇంస్టాగ్రామ్ , యూట్యూబ్ ఇన్ఫ్లుయెన్సర్లు అందరు ఒక్క వేదిక పైకి రావడం ఇదే మొదటిసారని తెలిపారు.

# అంగన్వాడి టీచర్ అక్రమాల కలకలం !!

- పౌష్టికాహారాన్ని తరలిస్తున్న పట్టుకున్నగ్రామస్తులు!!

**శివంపేట మే 5 (సిరీ న్యూస్ )**



మెదక్ జిల్లా చిన్న గొట్టిముక్కల గ్రామంలో అంగన్వాడీ టీచర్ విమల చిన్నారుల పౌష్టికాహారాన్ని కారులో అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు.చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారాన్ని అంగన్వాడీ టీచర్ అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని అధికారులకు అప్పగించారు. చిన్నారుల నోరు కొట్టి కోడిగుడ్లు బాలామృతం పౌష్టికాహారం అమ్ముకునేందుకు కారులో వాటిని అక్రమంగా తరలిస్తుండగా అంగన్వాడీ టీచర్ బాగోతాన్ని యువకులు బయటపెట్టారు మెదక్ జిల్లా శివంపేట మండలంలోని చిన్న గొట్టిముక్కల గ్రామంలో అంగన్వాడీ టీచర్ అంగన్వాడీ పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారాన్ని అక్రమంగా తరలిస్తుండగా గ్రామస్తులు మంగళవారం మధ్యాహ్నం పట్టుకున్నారు. పిల్లలకు పెట్టాలిసిన పోషకాహారమైన 5 గుడ్ల ట్రేలు బాల అమృతం 3 ప్యాకెట్లు మిల్క్ పాకెట్లు 8 ఆయిల్ 3 పాకెట్లు 5 కిలోల కంది పప్పు, తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని ఉన్నతాధికారులకు తెలిపారు. గత కొంతకాలంగా అంగన్వాడి టీచర్ విమల గ్రామంలోని చిన్నారులకు ఎలాంటి పౌష్టికాహారం పంపిణీ చేయలేదని ఈ సందర్భంగా గ్రామస్తులు తెలిపారు. ఇలాంటి అంగన్వాడి టీచర్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.. అంగన్వాడి టీచర్ విమల అక్రమంగా తరలిస్తున్న పిల్లల పౌష్టికారం అన్నింటిని గ్రామ పంచాయతీ భవనంలో ఉంచారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వారి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి

**కొండాపూర్ మే 5 (సిరిన్యూస్ ):**




రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని టీజీఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కొండాపూర్, మారేపల్లి, తేర్పోల్, గొల్లపల్లి,మల్కాపూర్ పిఎసిఎస్ కేంద్రాలలో వరి కొనుగోలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతుల ముంగట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం చేపట్టి పంట సాగు దిగుబడి, తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందే అవకాశాలు, సేంద్రియ వ్యవసాయం పట్ల కలిగే ప్రయోజనాలపై మెలుకువలు నేర్పిస్తున్నట్లు వెల్లడించారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వేయంగా పనిచేస్తుందన్నారు. రైతుల శ్రేయస్సు కోసమే రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింద ని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ లు మాణిక్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజు, పవన్ కుమార్, తాజా మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, నరసింహారెడ్డి,వెంకటేశం గౌడ్,శ్రీనివాస్ గౌడ్, అనిల్, శ్రీనివాస్ గౌడ్, భావన బాలవంత్ రెడ్డి, దివ్యవాణి ప్రశాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రభుదాస్, నర్సింలు,అశోక్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర సాంకేతికతతో వ్యవసాయం అభివృద్ధి

## జిలాల కలెక్టర్ రాజర్షిషా




**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలను అనుసరిస్తూ వ్యవసాయ సాంకేతికతతో సాగును లాభసాటిగా మార్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన—ప్రగతి ప్రణాళికలో భాగంగా హార్టికల్చర్ శాఖ ఆధ్వర్యంలో రైతులకు సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం కేఆర్కే కాలనీలోని హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్లో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుష సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డిలతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ చైర్పర్సన్ అనుష సతీష్ మాట్లాడుతూ పాత పద్ధతుల్లో సాగు కొనసాగించడం ద్వారా రైతులకు ఆశించిన లాభాలు అందడం లేదని తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను గుర్తించి సాగు చేయాలని, సందేహాలు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటేనే వ్యవసాయం లాభదాయకంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# ట్రేడింగ్, ఉద్యోగం పేరుతో రూ.1.70 కోట్ల మోసం

## విద్యుత్ శాఖ ఏఈ అరెస్ట్




**ఆదిలాబాద్(సిరి న్యూస్ ):** ట్రేడింగ్లో పెట్టుబడులు పెట్టిస్తానని, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి సుమారు రూ.1 కోటి 70లక్షల మోసానికి పాల్పడ్డ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిజామాబాద్కు చెందిన ప్రైవేట్ టీచర్ గుడూరు ఉమారాణికి 2014లో సల్మాన్ అలియాస్ సోలోమన్ రాజ్తో పరిచయం ఏర్పడింది. తాను విద్యుత్ శాఖలో ఏఈగా పనిచేస్తున్నానని చెప్పి నమ్మకం కల్పించిన నిందితుడు, 2022 నుంచి మోసానికి పాల్పడడం ప్రారంభించాడు. ట్రేడింగ్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించడంతో బాధితురాలు పరిచయస్తుల వద్ద అప్పులు చేసి సుమారు రూ.1.40 కోట్లు అందజేసింది. అదనంగా ఆమె కుమార్తెకు ఉద్యోగం ఇప్పిస్తానని మరో రూ.30 లక్షలు వసూలు చేశాడు. మొత్తం రూ.1.70 కోట్లు తీసుకున్న అనంతరం డబ్బులు తిరిగి ఇవ్వకుండా, ఉద్యోగం కల్పించకుండా మోసం చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ప్రభుత్వ పదవుల్లో ఉన్న వ్యక్తులు ఇలాంటి మోసాలకు పాల్పడటం విచారకరమని, ప్రజలు మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

## బాలీవుడ్‌లో సత్తా చాటలేకపోతున్న

# సౌత్ స్టార్స్..

**ఇక్కడ టాప్ పొజిషన్.. హిందీలో ఫ్లాపులు**

**ఉత్తరాది కథానాయికల ముందు తేలిపోతున్న దక్షిణాది భామలు**



సౌత్ ఇండియాలో స్టార్ హోదాను అనుభవిస్తున్న హీరోయిన్లు హిందీ తెరపై మాత్రం తమ మ్యాజిక్‌ను రిపీట్ చేయలేకపోతున్నారు. ఒకప్పుడు శ్రీదేవి, జయప్రద వంటి నటీమణులు బాలీవుడ్‌ను చాలా కాలాం ఏలారు. కానీ ప్రస్తుత తరం దక్షిణాది తారలకు అక్కడ అడుగుపెట్టడం సులభమైనా సెటిల్ అవ్వడం మాత్రం కత్తిమీద సాములా మారింది. స్టార్ ఇమేజ్ ఉన్నప్పటికీ హిందీలో వరుస ఫ్లాపులు పలకరిస్తుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఫిదా బ్యూటీ సాయి పల్లవి బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన ఆమె నటించిన 'ఏక్ దిన్' చిత్రం మే 1, 2026న విడుదలైంది. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. మొదటి మూడు రోజుల్లో ఈ చిత్రం కనీసం రూ. 3 కోట్ల రూపాయల వసూళ్లను కూడా రాబట్టలేకపోయింది. క్రిటిక్స్ సాయి పల్లవి నటనను మెచ్చుకున్నప్పటికీ కమర్షియల్‌గా ఈ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. చందమామ కాజల్ అగర్వాల్ దక్షిణాదిలో ఎన్నో ఏళ్లుగా స్టార్‌గా ఉన్నప్పటికీ హిందీలో మాత్రం సరైన బ్రేక్ దక్కించుకోలేకపోయింది. అజయ్ దేవగన్ సరసన 'సింగం' వంటి హిట్ ఉన్నా ఆ క్రేజ్ నిలవలేదు. ప్రస్తుతం కాజల్ 'ది ఇండియా స్టోరీతో పాటు 'రామాయణ్' చిత్రాలతో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇక చెన్నై చిన్నది త్రిష పరిస్థితి కూడా భిన్నంగా లేదు. అక్షయ్ కుమార్ సరసన 'కట్టా మీటా'తో ఎంట్రీ ఇచ్చి ఆ ఒక్క సినిమాతోనే బాలీవుడ్‌కు దూరమైంది. బుట్టబొమ్మ పూజా హెగ్డేకు హిందీలో హృతిక్ రోషన్, సల్మాన్ ఖాన్ వంటి స్టార్లతో నటించే అవకాశం వచ్చినా 'మొహెంజదారో', 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' వంటి చిత్రాలు ఫ్లాప్ అవ్వడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. తమన్నా, శ్రియ శరణ్ వంటి నటీమణులు బాలీవుడ్‌లో పదే పదే ప్రయత్నిస్తున్నా.. అక్కడ 'స్టార్' హోదాను మాత్రం అందుకోలేకపోతున్నారు.

## సబ్‌స్క్రిప్షన్ ట్రెండ్‌నూ వదలని జక్కన్న..

**ఇదెక్కడి మాస్ ప్లాన్ అయ్యా!**

బాహుబలి, RRR సినిమాలతో ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు పరిచయం చేసిన ఈ జక్కన్న, ఇప్పుడు సూపర్‌స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కిస్తున్న 'వారణాసి' కోసం అంతకు మించిన ప్లాన్‌తో రంగంలోకి దిగుతున్నారు.ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో తాజాగా ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది అదేమంటే ఈ మెగా ప్రాజెక్ట్ కోసం రాజమౌళి ఒక వినూత్నమైన మార్కెటింగ్ స్ట్రాటజీని అమలు చేయ బోతున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో బాగా వైరల్ అయిన సబ్ స్క్రిప్షన్ ట్రెండును రాజమౌళి ఇప్పుడు తనకు అనుకూలంగా వాడుకున్నట్టున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఏదైనా సినిమాకు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు లేదా నటీనటుల ఇంటర్వ్యూలు సినిమాని ప్రమోట్ చేసుకోవడానికి వాడుకుంటారు కాబట్టి దాదాపుగా అవన్నీ ఉచితంగానే దొరుకుతాయి.కానీ, 'వారణాసి' విషయంలో రాజ మౌళి రూటు మార్చారు. ఈ సినిమా వెనుక ఉన్న కష్టాన్ని, తెర వెనుక జరిగే ఆసక్తికరమైన BTS Videos వీక్షించాలనుకునే అభిమానుల కోసం రూ. 199 ధరతో ఒక ప్రత్యేక ప్యాకేజీని తీసుకు రానున్నట్లు సమాచారం. ఈ ప్యాకేజీలో మహేష్ బాబు, ప్రియాంక చోప్రాలకు సంబంధించిన ఎక్స్‌క్లూజివ్ ఫోటోలు., సినిమా కోసం వారు పడుతున్న శ్రమను వివరించే బిహైండ్ ది సీన్స్ వీడియోలు, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూలు, ప్రేక్షకులకు ఎక్కడా దొరకని కొన్ని ఆసక్తికరమైన 'టెడ్ బిట్స్' వంటి వాటిని ఉంచబోతున్నారు

## కామాక్షి షాకింగ్ డెసిషన్..
## కెరీర్ పీక్‌లోనే నటనకు తాత్కాలిక విరామం

**ముద్ర, సినిమా డెస్క్ :** టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంట్ కామాక్షి భాస్కర్ల ఊహించని నిర్ణయంతో సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వరుస అవకాశాలతో కెరీర్ జోరుగా సాగుతున్న వేళ, కొంతకాలం పాటు నటనకు మరియు కెమెరాకు దూరంగా ఉండాలని ఆమె ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది.'మా ఊరి పొలిమేర' చిత్రంతో డీ-గ్లామర్ పాత్రలో ప్రేక్షకులను ఆకట్టుకున్న కామాక్షి, ఆ తర్వాత గ్లామరస్ పాత్రలతోనూ తన ప్రత్యేకత చాటుకుంది. సోషల్ మీడియాలోనూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న ఆమె, ఇటీవల అడివి శేష్ నటించిన 'డెకాయిట్' చిత్రంలోనూ తన నటనతో ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం 'అగధ', 'మా ఊరి పొలిమేర-3' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉన్న సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది.తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన కామాక్షి, నటనపై విసుగు వల్ల కాకుండా మానసిక ఆరోగ్యం, స్వీయ సంరక్షణ కోసం ఈ బ్రేక్ తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది. జీవితంలో కొన్నిసార్లు మరింత బలంగా ముందుకు సాగేందుకు కాసేపు ఆగి మనసును సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని పేర్కొంది. తనకు ప్రస్తుతం ప్రశాంతత అవసరమని, ఇది శాశ్వత విరామం కాదని.. మరింత ఉత్సాహంతో తిరిగి వస్తానని తెలిపింది.సినీ పరిశ్రమలో నిరంతర ఒత్తిడి మధ్య వ్యక్తిగత ఆరోగ్యాన్ని ముందుకు పెట్టి ఇలాంటి నిర్ణయం తీసుకోవడం అరుదుగా కనిపిస్తుంటుంది. దీంతో కామాక్షి నిర్ణయాన్ని పలువురు నెటిజన్లు అభినందిస్తున్నారు. ఆరోగ్యం ముఖ్యమని, మరింత బలంగా తిరిగి రావాలని అభిమానులు సోషల్ మీడియాలో మద్దతు తెలుపుతున్నారు.కెరీర్ కంటే మానసిక ప్రశాంతతకే ప్రాధాన్యత ఇచ్చిన కామాక్షి నిర్ణయం ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. వ్యక్తిగత శ్రేయస్సు కోసం తీసుకున్న ఈ అడుగు, గ్లామర్ ప్రపంచంలో కొత్త చర్చకు తెరలేపింది.



## బుమ్రా కెరీర్‌లోనే.. అత్యంత చెత్త రికార్డు.. ?

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



ఒకప్పుడు డెత్ ఓవర్లలో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్‌ను వణికించిన స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా.. ఇప్పుడు ఐపీఎల్ 2026లో పూర్తిగా ఫామ్ కోల్పోయినట్లు కనిపిస్తున్నాడు. అతని ప్రదర్శన ఈ సీజన్‌లో తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. 10 మ్యాచ్‌ల్లో కేవలం మూడు వికెట్లు మాత్రమే తీసిన బుమ్రా, తన కెరీర్‌లోనే అత్యంత చెత్త గణాంకాలను నమోదు చేస్తున్నాడు. ఒకప్పుడు కచ్చితమైన యార్కర్లు, అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రపంచంలోని అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టిన బుమ్రా, ఈ సీజన్‌లో మాత్రం తన నియంత్రణ కోల్పోయాడు. అతని బౌలింగ్‌లో తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా LSGతో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో వరుసగా రెండు నో-బాల్స్ వేయడం అతని ఫామ్‌పై ప్రశ్నలు లేవనెత్తింది. అదే ఓవర్‌లో వికెట్ తీసుకున్నప్పటికీ, అది నో-బాల్ కారణంగా నాటౌట్‌గా మారిపోయింది..

ఈ సీజన్‌లో ఇప్పటివరకు బుమ్రా వేసిన నో-బాల్స్ సంఖ్య ఎనిమిదికి చేరింది. ఇది అతని స్థాయి బౌలర్‌కు అసాధారణం. ఈ అంశంపై భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా తీవ్రంగా స్పందించారు. ప్రొఫెషనల్ క్రికెటర్‌గా నో-బాల్స్ వేయడం అంగీకారయోగ్యం కాదని ఆయన వ్యాఖ్యానించారు. బుమ్రా బౌలింగ్‌లో ముఖ్యమైన బలం అయిన యార్కర్ కూడా ఈ సీజన్‌లో ప్రభావం కోల్పోయింది. ఒకప్పుడు పర్ఫెక్ట్‌గా ఉండే యార్కర్లు ఇప్పుడు ఫుల్ టాస్‌లుగా మారడం లేదా బ్యాట్స్‌మెన్ సులభంగా బౌండరీలు కొట్టడం కనిపిస్తోంది. టీ20 క్రికెట్‌లో చిన్న తప్పిదం కూడా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుంది, బుమ్రా విషయంలో అదే జరుగుతోంది. అంతేకాకుండా, ఆధునిక క్రికెట్‌లో డేటా విశ్లేషణ పెరగడంతో బ్యాట్స్‌మెన్ బౌలర్లను ముందుగానే అంచనా వేయగలుగుతున్నారు. బుమ్రా బౌలింగ్ శైలి, కోణం, లెంగ్త్‌పై బ్యాట్స్‌మెన్‌కు స్పష్టమైన అవగాహన రావడంతో అతనిపై ఒత్తిడి తగ్గింది. దీని వల్ల అతని డాట్ బాల్స్ సంఖ్య తగ్గిపోగా, వికెట్లు తీసే సామర్థ్యం కూడా ప్రభావితమైంది. మానసిక ఒత్తిడి కూడా బుమ్రా ఫామ్‌పై ప్రభావం చూపుతున్నట్లు కనిపిస్తోంది. వరుసగా వికెట్లు తీయలేకపోవడం వల్ల అతను ప్రతి బంతిని పర్ఫెక్ట్‌గా వేయాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలోనే మరిన్ని తప్పిదాలు జరుగుతున్నాయి. ముంబై ఇండియన్స్ జట్టు కూడా ఈ సీజన్‌లో అధిక స్కోర్లు ఇస్తుండటంతో, బౌలర్లపై అదనపు ఒత్తిడి పడుతోంది. అయితే, బుమ్రా వంటి ప్రతిభావంతుడైన బౌలర్‌ను తక్కువ అంచనా వేయడం తొందరపాటు అవుతుంది. క్రికెట్‌లో ఫామ్ తాత్కాలికమే, కానీ ప్రతిభ శాశ్వతం. ఒక మంచి స్పెల్‌తోనే అతను మళ్లీ తన పాత ఫామ్‌ను అందుకునే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతానికి, ఐపీఎల్ 2026లో బుమ్రా ప్రదర్శన అతని అభిమానులను నిరాశకు గురిచేస్తోంది.

## 'నన్ను టెస్ట్ ప్లేయర్ అన్నారు..'

**టీ20 ఆడటం రాదన్నారు: కేఎల్ రాహుల్ భావోద్వేగం..**

ప్రస్తుత క్రికెట్ ప్రపంచంలో క్లాసిక్ బ్యాటింగ్‌కు నిలువుటద్దం కేఎల్ రాహుల్. కర్ణాటకకు చెందిన ఈ కుడిచేతి వాటం బ్యాటర్, తన కెరీర్ ఆరంభంలో సాంప్రదాయ టెస్ట్ క్రికెట్‌కు మాత్రమే పనికొస్తాడని విమర్శలు ఎదుర్కొన్నాడు. కానీ. పట్టుదలతో తన శైలిని మార్చుకుని మూడు ఫార్మాట్లలోనూ అత్యుత్తమ ఆటగాడిగా ఎదిగాడు. ముఖ్యంగా ఐపీఎల్ వంటి వేదికలపై భారీ స్కోర్లతో పాటు వేగంగా పరుగులు సాధిస్తూ విమర్శకుల నోళ్లు మూయించాడు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఆడుతున్న రాహుల్, క్రీజులో ఉంటే ఆ ఫీల్డర్లకు పని చెప్పడం ఖాయం. మైదానంలో చురుకుగా ఉంటూ భారీ సిక్సర్లతో విరుచుకుపడటం అతని ప్రత్యేకత. గత పదేళ్ల ప్రయాణంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన రాహుల్, ఇప్పుడు మరింత పరిణతి చెందిన ఆటగాడిగా కనిపిస్తున్నాడు. అయితే తాజాగా 'జియోస్టార్' టాక్ షోలో పాల్గొన్న రాహుల్.. తన అంతరంగంలోని భావాలను పంచుకున్నాడు. తనపై ఉన్న "టెస్ట్ స్పెషలిస్ట్" అనే ముద్రను చెరిపివేసి, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో నిరూపించుకోవడం పట్ల గర్వంగా ఉందని తెలిపాడు. టెస్ట్ క్రికెట్ కు మాత్రమే నువ్వు ఆడగలవు.. టీ20 క్రికెట్ కు పనికి రావు అని చాలా మంది అంటుంటే ఎంతో బాధపడ్డట్లు చెప్పుకొచ్చాడు. పదేళ్ల క్రితం టీ20 జట్టులో చోటు దక్కించుకోవడం తనకు కలగా ఉండేదని, కానీ నిరంతర శ్రమతో ఆ అడ్డంకులను అధిగమించానని చెప్పాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌పై 64 బంతుల్లోనే 152 పరుగులు చేసిన అద్భుత ఇన్నింగ్స్ గురించి ప్రస్తావిస్తూ.. ఫలితం అనుకూలంగా రాకపోయినా తన ఆటతీరుపై తనకు సంతృప్తి ఉందన్నాడు.

## ముగిసిన మిస్టర్ కూల్ శకం?

**ఐపీఎల్ 2026 నుంచి ధోనీ అవుట్!**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**



ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం ఎంఎస్ ధోని ఈ సీజన్ (IPL 2026) మొత్తానికి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పిక్క గాయం కారణంగా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని ధోని, తాజాగా మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరగనున్న కీలక పోరుకు కూడా అందుబాటులో లేకపోవడంతో అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత మ్యాచ్‌ల వరకు ధోని మైదానానికి రాకపోయినా జట్టుతో పాటే ఉన్నాడు. అయితే ఢిల్లీతో మ్యాచ్ కోసం సీఎస్కే జట్టు ఢిల్లీకి పయనమవగా, ధోని వారితో కలిసి వెళ్లలేదని సమాచారం. ఈ విషయాన్ని సీఎస్కే బౌలింగ్ సలహాదారు ఎరిక్ సిమన్స్ స్వయంగా ధృవీకరించారు. "ధోని ప్రస్తుతం మాతో లేడు. ఆయన ఇంకా గాయం నుంచి కోలుకుంటున్నారు" అని సిమన్స్ పేర్కొన్నారు.

### ముగిసిన శకం?

జట్టుతో పాటు ధోని ప్రయాణించకపోవడంతో ఆయన ఈ సీజన్ నుంచి పూర్తిగా తప్పుకున్నట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. 44 ఏళ్ల వయసులో గాయం తిరగబెట్టడం, మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేకపోవడంతో ఇదే ఆయనకు చివరి ఐపీఎల్ అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. మైదానంలోకి దిగకుండానే ధోని రిటైర్మెంట్ ప్రకటించవచ్చని వస్తున్న ఊహాగానాలు సీఎస్కే అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఇదే సమయంలో ధోని సేవలు అందుబాటులో లేకపోవడం చెన్నై జట్టు ప్రదర్శనపై కూడా ప్రభావం చూపుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన 9 మ్యాచ్‌ల్లో కేవలం 04 మ్యాచ్‌లు గెలిచి, 05 మ్యాచ్‌లు ఓడిపోయింది. ప్రస్తుతం ఈ జట్టు పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో కొనసాగుతుంది. చెన్నై ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన మ్యాచ్‌లు అత్యంత కీలకం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ధోని గైర్హాజరు జట్టుకు పెద్ద లోటుగా మారింది. మరి ధోనీ ఈ సీజన్ చివరలోనైనా మైదానంలో కనిపిస్తాడా లేక ఇలాగే వీడ్కోలు పలుకుతాడా అనేది వేచి చూడాలి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.